Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU





అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 327 పేజీలు (Pages): 8 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)
శుక్రవారం, 14 - 8 - 2026
94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం: 2015

# అమరావతి నిర్మాణంలో రైతుల త్యాగాలు చిరస్మరణీయం

## - ఆంధ్రుల రాజధాని అమరావతికి సరికొత్త శోభ - సీడ్ యాక్సిస్ రోడ్ ఫేజ్-2, స్టీల్ బ్రిడ్జిని ప్రారంభించిన సీఎం చంద్రబాబు - రైతుల బహిరంగ సభలో మంత్రి నారాయణ







**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రుల రాజధాని అమరావతికి సరికొత్త శోభ వచ్చిందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. అమరావతి ముఖద్వారం ఉండవల్లి వద్ద సీడ్ యాక్సిస్ రోడ్ ఫేజ్-2తో పాటు స్టీల్ బ్రిడ్జిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. అనంతరం రైతులతో నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి నారాయణ ప్రసంగించారు. సీడ్ యాక్సిస్ రోడ్ అలైన్‌మెంట్, నిర్మాణ వివరాలను ముఖ్యమంత్రికి మంత్రి వివరించారు. అమరావతి రాజధాని నిర్మాణానికి రైతులు చేసిన త్యాగాలు చిరస్మరణీయమని మంత్రి నారాయణ అన్నారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతుల సహకారాన్ని ఎప్పటికీ మరచిపోలేమన్నారు. అమరావతి నిర్మాణంపై రైతులకు ఉన్న విశ్వాసానికి వారి అపూర్వమైన సహకారమే నిదర్శనమని పేర్కొన్నారు.

**58 రోజుల్లో 34 వేల ఎకరాల భూమి**

రాజధాని నిర్మాణం కోసం 2015 జనవరిలో భూ సమీకరణ ప్రక్రియకు నోటిఫికేషన్ ఇచ్చామని మంత్రి తెలిపారు. 2015 జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ అర్ధరాత్రి వరకు కేవలం 58 రోజుల్లోనే సుమారు 34 వేల ఎకరాల భూమిని రైతులు స్వచ్ఛందంగా అందించారని చెప్పారు. ఒక్క లిటిగేషన్ కూడా లేకుండా రైతులు తమ భూములను అందించడం దేశ చరిత్రలోనే విశేషమైన విషయమన్నారు. ఎటువంటి కోర్టు కేసులు, వివాదాలు లేకుండా రైతులు భూములు ఇవ్వడం అమరావతి నిర్మాణంపై వారికి ఉన్న విశ్వాసాన్ని తెలియజేస్తుందని అన్నారు. అమరావతి నిర్మాణానికి రైతులు అందించిన సహకారం, చేసిన త్యాగాలు చిరస్మరణీయమని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

**ఆర్థిక రాజధానిగా అమరావతి**

ఆంధ్రప్రదేశ్ రాజధాని లేని రాష్ట్రంగా మారిన పరిస్థితుల్లో రాష్ట్రానికి ఒక ఆర్థిక రాజధానిని నిర్మించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిని ఎంపిక చేశారని మంత్రి తెలిపారు. తెలంగాణకు హైదరాబాద్ ద్వారా, మహారాష్ట్రకు ముంబయి ద్వారా, కర్ణాటకకు బెంగళూరు ద్వారా, తమిళనాడుకు చెన్నై ద్వారా పెద్ద ఎత్తున ఆదాయం వస్తోందని పేర్కొన్నారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌కు కూడా ఆర్థికంగా బలమైన రాజధాని అవసరమనే ఉద్దేశంతో అమరావతి నిర్మాణానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. కృష్ణానది ఒడ్డున అమరావతిని నిర్మించడం ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సమన్యాయం జరుగుతుందని ముఖ్యమంత్రి భావించారని తెలిపారు.శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు రాష్ట్రానికి మధ్యలో అమరావతి ఉండటం, రైలు, రోడ్డు మార్గాల పరంగా మంచి అనుసంధానం ఉండటం రాజధాని ఎంపికకు ప్రధాన కారణాల్లో ఒకటని మంత్రి వివరించారు.

**సింగపూర్ మాస్టర్ ప్లాన్, ఐకానిక్ భవనాలు**

అమరావతిని ప్రణాళికాబద్ధమైన అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి చేసేందుకు సింగపూర్ ప్రభుత్వం మాస్టర్ ప్లాన్‌ను ఉచితంగా అందించిందని మంత్రి తెలిపారు. రాజధానిలో ఐకానిక్ భవనాల నిర్మాణం కోసం లండన్‌కు చెందిన నార్మన్ ఫోస్టర్ సంస్థను సంప్రదించినట్లు చెప్పారు.అంతర్జాతీయ ప్రమాణాలతో అమరావతిని ప్రపంచంలోని అత్యుత్తమ నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

**350 కిలోమీటర్ల ట్రంక్ రోడ్లు.. భూగర్భ మౌలిక వసతులు**

అమరావతిలో సుమారు 350 కిలోమీటర్ల మేర ట్రంక్ రోడ్లను నిర్మించడంతో పాటు సమగ్ర భూగర్భ మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు.సీడ్ యాక్సిస్ రోడ్డుకు అనుసంధానంగా విద్యుత్, గ్యాస్, టెలిఫోన్, తాగునీటి సరఫరా తదితర సేవలను భూగర్భంలోనే ఏర్పాటు చేసేలా ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. డ్రైనేజీ, పునర్వినియోగ నీటి పైపు లైన్లు, వర్షపు నీటి కాలువలు వంటి మౌలిక వసతులను కూడా సమగ్రంగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు.

**గతంలో పనులకు ఆటంకాలు.. తిరిగి వేగం**


అమరావతిలో పనులు ప్రారంభించడం, టెండర్లు పిలవడం, ఇతర ప్రక్రియలు చేపట్టడానికి సుమారు మూడున్నర సంవత్సరాల సమయం పట్టిందని మంత్రి నారాయణ తెలిపారు. ఆ తర్వాత సుమారు ఏడాదిన్నర కాలంలో అమరావతి కోసం రూ.10 వేల కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు.అయితే అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు రాజధానుల ప్రతిపాదనను తీసుకు రావడంతో అమరావతి నిర్మాణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని మంత్రి అన్నారు. నిర్మాణ సంస్థలతో ఉన్న ఒప్పందాలను క్లోజ్ చేయకుండా వదిలేయడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని సాంకేతికంగా క్లోజ్ చేసి, తిరిగి టెండర్లు పిలవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గతంలో జరిగిన నిర్మాణ పనుల నాణ్యతను ఐఐటీ చెన్నై, ఐఐటీ హైదరాబాద్ నిపుణులతో పరీక్షింపజేసిన అనంతరం పనులను తిరిగి ప్రారంభించామని మంత్రి తెలిపారు. సాంకేతికంగా ఎదురైన సమస్యలను నిపుణుల సలహాలతో పరిష్కరిస్తూ నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామని చెప్పారు.

**రైతులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేసినా.. వెనక్కి తగ్గని రైతులు**


అమరావతి నిర్మాణానికి అడ్డంకులు సృష్టించే ప్రయత్నాలు జరిగినప్పటికీ రైతులు మాత్రం రాజధాని నిర్మాణానికి తమ మద్దతును కొనసాగించారని మంత్రి నారాయణ అన్నారు. రైతులను రెచ్చగొట్టే ప్రయత్నాలు జరిగినా వారు అమరావతి నిర్మాణానికి సహకరించారని పేర్కొన్నారు. రైతుల త్యాగాలు, సహకారం వల్లే అమరావతి నిర్మాణానికి బలమైన పునాది ఏర్పడిందని మంత్రి తెలిపారు. వారి ఆశలు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అమరావతి నిర్మాణాన్ని పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

**రవాణా వ్యవస్థలో కీలకంగా స్టీల్ బ్రిడ్జిలు**

సీడ్ యాక్సిస్ రోడ్డుకు అనుసంధానంగా నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జిలు అమరావతి రవాణా వ్యవస్థలో కీలకంగా నిలుస్తాయని మంత్రి నారాయణ తెలిపారు. ఒక వంతెన జాతీయ రహదారితో అనుసంధానం కానుండగా, మరొక వంతెన మంగళగిరి రోడ్డు వైపు అనుసంధానమవుతుందని చెప్పారు. మంగళగిరి వైపు వెళ్లే వంతెన ఇప్పటికే పూర్తయిందని పేర్కొన్నారు. సీడ్ యాక్సిస్ రోడ్ ఫేజ్-2, స్టీల్ బ్రిడ్జి ప్రారంభంతో అమరావతి రవాణా మౌలిక వసతుల్లో మరో కీలక ముందడుగు పడిందన్నారు. రాజధాని నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసి అమరావతిని రాష్ట్రానికి ఆర్థిక, పరిపాలనా, మౌలిక వసతుల కేంద్రంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి నారాయణ తెలిపారు. అమరావతి వంటి ప్రతిష్టాత్మక రాజధాని నిర్మాణంలో పాలుపంచుకునే అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి మంత్రి నారాయణ ధన్యవాదాలు తెలిపారు. రైతుల సహకారంతో అమరావతి నిర్మాణాన్ని పూర్తి చేసి, వారి ఆశలు, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తామని మంత్రి స్పష్టం చేశారు.




# 60 రవాణా విమానాలు, 150 శిక్షణ విమానాలు.. భారత రక్షణ రంగం భారీ కొనుగోళ్లు



**ఇంటర్నెట్ డెస్క్:** భారత వాయుసేనను మరింత బలోపేతం చేసేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ భారీగా విమానాలను కొనుగోలు చేయనుంది. 60 రవాణా విమానాలు, 150 శిక్షణ విమానాలను సమకూర్చుకునేందుకు సిద్ధమవుతోంది. భారతదేశంలో తయారైన విమానాలను కొనుగోలు చేయడానికే ప్రాధాన్యం ఇవ్వడం ఈ ప్రాజెక్టులో కీలకాంశం. వివిధ ప్రయోజనాల కోసం వినియోగించే 60 రవాణా విమానాల కొనుగోలు ప్రాజెక్టు విలువ దాదాపు రూ.1 లక్ష కోట్లు ఉండవచ్చని రక్షణ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ భారీ ప్రాజెక్టులో దేశీయ సంస్థలకు కీలక పాత్ర లభించే అవకాశం ఉంది. టాటా గ్రూప్, మహీంద్రా గ్రూప్, ప్రభుత్వరంగ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ పోటీలో ముందుండే అవకాశం ఉందని సమాచారం. గుజరాత్‌లో ఎయిర్‌బస్‌తో కలిసి సీ-295 రవాణా విమానాల తయారీలో టాటా ఇప్పటికే కీలక పాత్ర పోషిస్తోంది. బాగా పాతబడిన భారత వాయుసేన రవాణా విమానాల స్థానంలో కొత్త విమానాలను ప్రవేశపెట్టడం ఈ కొనుగోలు ప్రధాన ఉద్దేశం. సైనికులు, ఆయుధ సామగ్రి, ఇతర అవసరమైన సరఫరాలను దేశంలోని సుదూర ప్రాంతాలకు వేగంగా తరలించేందుకు ఈ విమానాలు ఉపయోగపడనున్నాయి. ఇక, 150 శిక్షణ విమానాలను కొనుగోలు చేసేందుకు కూడా రక్షణ మంత్రిత్వ శాఖ మరో అభ్యర్థనను జారీ చేసింది. ఈ ప్రాజెక్టు విలువ సుమారు రూ.15,000 కోట్లు ఉండవచ్చని అంచనా. వాయుసేనలో కొత్త తరం పైలట్లను సిద్ధం చేయడానికి శిక్షణ విమానాలు అత్యంత కీలకం. ప్రాథమిక శిక్షణకు ఉపయోగపడే హెచ్‌టీటీ-40 విమానాలను ఇప్పటికే హెచ్ఏఎల్ తయారు చేస్తోంది. కాగా, ఈ రెండు కొనుగోలు ప్రక్రియలు ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా దేశీయ విమాన తయారీ సామర్థ్యాన్ని పెంచే కీలక అడుగుగా భావిస్తున్నారు.

# విద్యే మనిషి జీవితాంతం వెంట తీసుకెళ్లగల నిజమైన సంపద: ఛాన్సలర్ డా. జి. విశ్వనాథన్

## - వీఐటీ-ఏపీ యూనివర్సిటీలో 2026 బ్యాచ్‌కు ఘన స్వాగతం
## - ఫ్రెషర్స్ స్టూడెంట్ ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహణ







**అమరావతి, (రాజధాని వార్తలు):** 2026–27 విద్యా సంవత్సరానికి కొత్తగా ప్రవేశం పొందిన విద్యార్థులను అధికారికంగా విశ్వవిద్యాలయంలోకి ఆహ్వానిస్తూ వీఐటీ–ఏపీ యూనివర్సిటీలో ఫ్రెషర్స్ స్టూడెంట్ ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ విద్యా వాతావరణం, అందుబాటులో ఉన్న అవకాశాలు, విలువలు, ఉన్నత విద్యా ప్రయాణంలో ఎదురయ్యే అవకాశాలు తదితర అంశాలపై నూతన విద్యార్థులకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఉన్నతాధికారులు, పరిశ్రమ నిపుణులు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిచర్డ్ కింగ్ (టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, హైదరాబాద్ – రీజియన్ హెడ్, అకడమిక్ అలయన్సెస్) మరియు గౌరవ అతిథిగా సందల్ కొటావాలా (ఆల్ఫాలియస్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్ వ్యవస్థాపకుడు, సీఈఓ) హాజరయ్యారు. నూతన విద్యార్థులను ఉద్దేశించి ముఖ్య అతిథి రిచర్డ్ కింగ్ మాట్లాడుతూ, విశ్వవిద్యాలయంలో అడుగుపెట్టడం అనేది విద్యార్థుల జీవితంలో ఒక కొత్త ప్రయాణానికి నాంది అని పేర్కొన్నారు. తమలోని సామర్థ్యాలను గుర్తించుకోవడం, వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవడం, భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడానికి ఇది ఒక అద్భుతమైన అవకాశమని అన్నారు. ఈ కీలక మైలురాయిని చేరుకునేందుకు తల్లిదండ్రులు అందించిన సహకారం, చేసిన త్యాగాలను విద్యార్థులు ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని సూచించారు. వీఐటీ యూనివర్సిటీ ఛాన్సలర్ డా. జి. విశ్వనాథన్ మాట్లాడుతూ ఒక వ్యక్తి జీవితంలో సంపాదించగలిగే అత్యంత శాశ్వతమైన సంపద విద్యేనని పేర్కొన్నారు. తమిళ సాహిత్యంలో వ్యక్తమైన జ్ఞానాన్ని ప్రస్తావిస్తూ, విద్యను నాశనం చేయలేరని, దొంగిలించలేరని, ఎవరి నుంచి లాక్కోలేరని అన్నారు. భౌతిక సంపదకు భిన్నంగా విద్యను ఇతరులతో పంచుకున్న కొద్దీ అది మరింత అభివృద్ధి చెందుతుందని వివరించారు. ఆర్థిక, సామాజిక ప్రగతిని సాధించాలనుకునే దేశాలు విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు నాణ్యమైన ఉన్నత విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని ఆయన అన్నారు. భారతదేశ ఉన్నత విద్యా రంగాన్ని ప్రస్తావిస్తూ, విద్యపై మరింత పెట్టుబడులు అవసరమని పేర్కొన్నారు. విద్య కోసం స్థూల దేశీయోత్పత్తిలో సిఫారసు చేసిన 6 శాతం కేటాయింపును సాధించే దిశగా భారత్ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. గౌరవ అతిథి సందల్ కొటావాలా మాట్లాడుతూ 2014లో వీఐటీ వెల్లూరులో విద్యార్థిగా ఉన్న తన వ్యక్తిగత ప్రయాణాన్ని నూతన విద్యార్థులతో పంచుకున్నారు. తన అధ్యాపకులు, డీన్ అందించిన ప్రోత్సాహాన్ని గుర్తుచేసుకున్న ఆయన, యూనివర్సిటీ అందించిన స్వేచ్ఛాయుత వాతావరణం తన ఆలోచనలను ముందుకు తీసుకెళ్లేందుకు, వాటిని ఆవిష్కరణలుగా మలచేందుకు ఎంతగానో దోహదపడిందని తెలిపారు. వీఐటీ–ఏపీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా. పి. అరుళ్మొళివర్మన్ మాట్లాడుతూ, విద్య ఉద్దేశ్యం కేవలం ఒక డిగ్రీని సంపాదించడానికే పరిమితం కాదని పేర్కొన్నారు. విద్యార్థులు తమలోని సామర్థ్యాలను గుర్తించి, ప్రతిభను పెంపొందించుకుని, జీవితంలో విజయాన్ని సాధించేందుకు అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. విద్య అనేది కేవలం డిగ్రీ సంపాదించడం మాత్రమే కాదు; మనలోని సామర్థ్యాన్ని గుర్తించుకోవడం, ప్రతిభను పెంపొందించుకోవడం, జీవితంలో విజయాన్ని సాధించేందుకు అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసాన్ని అభివృద్ధి చేసుకోవడం" అని ఆయన అన్నారు. వీఐటీ–ఏపీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా.జగదీశ్ చంద్ర ముడిగంటి మాట్లాడుతూ నూతన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను యూనివర్సిటీకి సాదరంగా ఆహ్వానించారు. డా. జాన్ ప్రదీప్ (డిప్యూటీ డైరెక్టర్ – అడ్మిషన్స్) కూడా కార్యక్రమంలో ప్రసంగించి, విద్యార్థులు తమ విద్యా ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న దశలో వారికి అవసరమైన సహకారం అందించేందుకు యూనివర్సిటీ చేపడుతున్న చర్యలను వివరించారు.

# కొత్త ఎక్సైజ్ పాలసీపై కసరత్తు




**మంగళగిరి, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో ప్రస్తుత ఎక్సైజ్ పాలసీ గడువు సెప్టెంబర్ 30తో ముగియనున్న నేపథ్యంలో, తదుపరి రిటైల్ ఎక్సైజ్ పాలసీ రూపకల్పనపై మంత్రుల బృందం గురువారం మంగళగిరిలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో సమావేశమై విస్తృతంగా చర్చించింది. గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆన్‌లైన్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. రెవెన్యూ (ఎక్సైజ్) శాఖ ముఖ్య కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డైరెక్టర్ చామకూరి శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మతో పాటు ఎక్సైజ్ శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. 2024–26 రిటైల్ ఎక్సైజ్ పాలసీ అమలు ద్వారా జూలై 2026 వరకు వచ్చిన ఫలితాలపై అధికారులు మంత్రుల బృందానికి సమగ్రంగా వివరించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న పాలసీ సెప్టెంబర్ 30తో ముగియనున్న నేపథ్యంలో, ఆ తర్వాత అమలు చేయాల్సిన కొత్త రిటైల్ ఎక్సైజ్ పాలసీకి సంబంధించి రూపొందించిన వివిధ నమూనాలను కూడా సమావేశంలో అధికారులు మంత్రుల బృందం ముందు ఉంచారు. కొత్త పాలసీ రూపకల్పన కోసం వివిధ వర్గాల నుంచి అందిన సూచనలు, అభిప్రాయాలను కూడా వివరించారు. ప్రతిపాదించిన వివిధ నమూనాలపై మంత్రుల బృందం సుదీర్ఘంగా చర్చించింది. అందుబాటులో ఉన్న సమాచారం, గణాంకాలను పరిశీలించిన అనంతరం ప్రతిపాదిత నమూనాలను మరింతగా సవరించి, సంబంధిత పూర్తి వివరాలు, ఆధారిత గణాంకాలతో మరోసారి సమర్పించాలని అధికారులను మంత్రుల బృందం ఆదేశించింది. ప్రస్తుత ఎక్సైజ్ పాలసీ పనితీరు, ఇప్పటివరకు వచ్చిన ఫలితాలు, వివిధ వర్గాల నుంచి వచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకుని సెప్టెంబర్ 30 తర్వాత అమలు చేయాల్సిన కొత్త రిటైల్ ఎక్సైజ్ పాలసీని రూపొందించే ప్రక్రియలో భాగంగానే ఈ సమావేశం నిర్వహించారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి భాద్యత : ఎమ్మెల్యే

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పర్యా వరణ పరిరక్షణ, పచ్చదనం పెంచే భాద్యత మనందరిది అని ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. పెద్దాపురం పట్టణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం నియోజకవర్గ శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని పిలుపునిచ్చారు. పట్టణాల్లో పచ్చదనం పెంపొందించడం ద్వారా స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని భవిష్యత్ తరాలకు అందించవచ్చని తెలిపారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని నిరంతరం సంరక్షించి, పెంచేలా ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ



భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

# విస్తృత ప్రాంత స్థాయిలో మానవ-ఏనుగుల సంఘర్షణ నిర్వహణను మరింత బలోపేతం





**అమరావతి, (రాజధాని వార్తలు):** పెంపకం: విజ్ఞానం, సంక్షేమం మరియు ఆచరణ'; మరియు కేరళం, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా మరియు పశ్చిమ బెంగాల్‌లలో మానవ–ఏనుగుల సంఘర్షణ అధ్యయనానికి సంబంధించిన రెండవ దశ వంటి కీలక ప్రచురణలను ఈ కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ చొరవలు ఆధారాల సంరక్షణ, బంధిత ఏనుగుల సంక్షేమం మరియు విస్తృత ప్రాంత స్థాయిలో మానవ–ఏనుగుల సంఘర్షణ నిర్వహణను మరింత బలోపేతం చేస్తాయి. 'మానవ–ఏనుగుల సంఘర్షణ: భారతదేశ వ్యాప్తంగా విభిన్న పరిస్థితులు' అనే అంశంపై ఒక కార్యశాలను కూడా ఈ వేడుకల్లో భాగంగా నిర్వహించారు. ఇందులో ఏనుగుల సంచార రాష్ట్రాలకు చెందిన శాస్త్రీయ సంస్థలు, క్షేత్రస్థాయి ఏజెన్సీలు, నియంత్రణ అధికారులు పాల్గొన్నారు. శాస్త్రీయ ఆధారాలు, దీర్ఘకాలిక డేటాసెట్‌లు, క్షేత్రస్థాయి అనుభవాల ద్వారా మానవ–ఏనుగుల సంఘర్షణ స్థితి, పోకడలు, ప్రాంతీయ వైవిధ్యాలు వంటి విషయాలను ఈ కార్యశాలలో సమీక్షించారు. పశువైద్యపరమైన చర్యలు, విద్యుదాఘాతం, రైల్వే సంబంధిత ఏనుగుల మరణాల నివారణ, ఆవాసాలు మరియు కారిడార్ల నిర్వహణ, సమీకృత భూభాగ విధానాలతో పాటు సంఘర్షణ నివారణ కోసం వినూత్న విధానాలు, సాంకేతికతలు ఉత్తమ పద్ధతులపై చర్చలను జరిపారు. మానవ–ఏనుగుల సహజీవనాన్ని ప్రోత్సహించేందుకు సమన్వయంతో కూడిన, శాస్త్రీయ ఆధారిత వ్యూహాల కోసం కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, రాష్ట్ర అటవీ శాఖలు, పరిశోధనా సంస్థలు, భారతీయ రైల్వే, ఇతర భాగస్వాముల మధ్య సహకారాన్ని బలోపేతం చేయాలని ఈ కార్యశాలలో వివరించారు. ప్రాజెక్ట్ ఎలిఫెంట్ దేశవ్యాప్త వేడుకల్లో భాగంగా, నేషనల్ మ్యూజియం ఆఫ్ నేచురల్ హిస్టరీ సహకారంతో దేశవ్యాప్తంగా ఒక భారీ అవగాహన ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ ప్రచార కార్యక్రమంలో 21,450 పాఠశాలల నుంచి 20 లక్షలకు పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఏనుగుల పర్యావరణ, సాంస్కృతిక ప్రాముఖ్యత, వాటి ఆవాసాలను పరిరక్షించాల్సిన ఆవశ్యకత గురించి పిల్లలకు అవగాహన కల్పించేందుకు పెయింటింగ్, మాస్క్–మేకింగ్ పోటీలు, ర్యాలీలు, వీధి నాటకాలు, అవగాహన, ప్రతిజ్ఞా కార్యక్రమాలను నిర్వహించారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు ఏనుగులను సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేసి, వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణకు యువ రాయబారులుగా మారతామనే వారి నిబద్ధతను తెలియజేశారు. విశాఖపట్నంలో నిర్వహించిన ప్రపంచ ఏనుగుల దినోత్సవం 2026 వేడుకలు జాతీయ వారసత్వ జంతువైన ఏనుగు భవిష్యత్తును సురక్షితం చేసేందుకు, ఆరోగ్యకరమైన ఏనుగుల జనాభాను, స్థితిస్థాపక అటవీ ప్రకృతి దృశ్యాలను భవిష్యత్ తరాలు వారసత్వంగా పొందేలా, విజ్ఞాన శాస్త్రం, సాంకేతికత, ఆవాసాలు, కారిడార్ల పరిరక్షణ, సామాజిక భాగస్వామ్యం, సమన్వయ చర్యల ద్వారా భారతదేశ దాని నిబద్ధతను తెలియజేస్తోంది.

# అవయవ దానంపై అవగాహన కల్పించేందుకు ఎయిమ్స్ మంగళగిరి వాకథాన్, ఫ్లాష్ మాబ్‌ను నిర్వహించింది






**మంగళగిరి, (రాజధాని వార్తలు):** ప్రపంచ అవయవ దాన దినోత్సవం 2026 సందర్భంగా, రోగులు, వారి సహాయకులు, ఆరోగ్య నిపుణులు, విద్యార్థులు మరియు సాధారణ ప్రజలలో అవయవ దానం యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు, ఎయిమ్స్ మంగళగిరిలోని మెడికల్ సూపరింటెండెంట్ కార్యాలయం మరియు ఆసుపత్రి పరిపాలన విభాగం సంయుక్తంగా ఈరోజు ఒక వాకథాన్ మరియు ఫ్లాష్ మాబ్‌ను నిర్వహించాయి. ఈ వాకథాన్ ఉదయం 6:00 గంటలకు ఐపీడీ–ఓపీడీ జంక్షన్ నుండి ప్రారంభమై, ఎయిమ్స్ మంగళగిరి ఆడిటోరియంలో ముగిసింది. ఈ వాకథాన్‌లో ఎయిమ్స్ మంగళగిరి గౌరవ కార్యనిర్వహణాధికారులు ప్రొఫెసర్ (డా.) అహంతేం శాంతా సింగ్, గౌరవనీయ డీనరీలు, అధ్యాపక సభ్యులు, రెసిడెంట్లు, నర్సింగ్ అధికారులు, విద్యార్థులు మరియు ఇతర సిబ్బందితో కలిసి చురుకుగా పాల్గొన్నారు. ఈ వాకథాన్‌లో విద్యార్థులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని, నినాదాలు మరియు సమాచార ఫలకాల ద్వారా అవగాహన కల్పించారు. ఈ ఫలకాలు జీవదాన్ ప్రతిజ్ఞ, స్వచ్ఛంద అవయవ దాన ప్రక్రియ, మరియు అవయవ దానం చుట్టూ ఉన్న సాధారణ అపోహలు, అపార్థాలను ప్రముఖంగా చూపించాయి. తద్వారా, ఆలోచించి నిర్ణయాలు తీసుకోవలసిన ప్రాముఖ్యతను తెలియజేస్తూ, మరింత మంది తమ అవయవాలను దానం చేయడానికి ముందుకు వచ్చేలా ప్రోత్సహించాయి. ఈ కార్యక్రమం అవయవ దానంపై మరింత అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పింది. అలాగే, అవయవ దానం అనే ఈ గొప్ప కార్యం ద్వారా ప్రాణాలను కాపాడటానికి సమాజ సభ్యులు ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందించేలా ప్రోత్సహించింది. ఎయిమ్స్ మంగళగిరి సమాజం యొక్క ఈ ఉత్సాహభరితమైన భాగస్వామ్యం, ముఖ్యమైన ఆరోగ్య మరియు సామాజిక అంశాలపై ప్రజలలో అవగాహన కల్పించడంలో వారి నిబద్ధతను ప్రతిబింబించింది. అవగాహన కార్యక్రమాలలో భాగంగా, ఎయిమ్స్ మంగళగిరిలోని అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు మధ్యాహ్నం 12:00 గంటలకు ఐపిడి–ఓపిడి జంక్షన్ వద్ద ఒక ఫ్లాష్ మాబ్‌ను నిర్వహించారు. ఈ ఉత్సాహభరితమైన ప్రదర్శన రోగులు, వారి సహాయకులు మరియు సాధారణ ప్రజల దృష్టిని ఆకర్షించి, అవయవ దానం యొక్క సందేశాన్ని సమర్థవంతంగా తెలియజేసింది. రెసిడెంట్ డాక్టర్లు ఈ ప్రదర్శనకు తోడుగా, ప్రేక్షకులతో సంభాషిస్తూ, స్వచ్ఛంద అవయవ దానం, జీవదాన్ ప్రతిజ్ఞ, మరియు అవయవ దానానికి సంబంధించిన సాధారణ అపోహలు మరియు అపార్థాలపై వారికి అవగాహన కల్పించారు. ఈ సంయుక్త చొరవ, అవయవ దానం అనే గొప్ప కార్యం అనేక జీవితాలను కాపాడి, మార్చగలదని అనే సందేశాన్ని మరింత బలోపేతం చేసింది. ఈ కార్యక్రమంలో భాగంగా, ఎయిమ్స్ మంగళగిరిలోని మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ మరియు సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగాలచే ఒక నిరంతర వైద్య విద్యా కార్యక్రమం కూడా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది వైద్య నిపుణులు పాల్గొన్నారు మరియు అంతర్గత అధ్యాపక సభ్యులతో పాటు ఇద్దరు బాహ్య నిపుణులచే సెషన్‌లు నిర్వహించబడ్డాయి. ఈ సిఎంఇ, అవయవ దానం మరియు మార్పిడికి సంబంధించిన వివిధ అంశాలపై ఆరోగ్య సంరక్షణ నిపుణులలో అవగాహన మరియు జ్ఞానాన్ని పెంపొందించడంపై దృష్టి సారించింది.

అదే సమయంలో ఈ రంగంలో జ్ఞాన భాగస్వామ్యం మరియు వృత్తిపరమైన అభ్యాసాన్ని సులభతరం చేసింది. అవయవ దానం యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం, అపోహలను తొలగించడం, అవయవ దానం మరియు మార్పిడిపై సమాచారంతో కూడిన సంభాషణ లను ప్రోత్సహించడం అనే లక్ష్యంతో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. కరుణ, సామాజిక బాధ్యత మరియు ఆరోగ్య సంరక్షణ సంబంధిత కార్యక్రమాలలో భాగస్వామ్యం వంటి సంస్కృతిని ప్రోత్సహించే లక్ష్యంతో ఎయిమ్స్ మంగళగిరి సమాజ ఆధారిత అవగాహన కార్యక్రమాలను కొనసాగిస్తోంది.

# మదుగులమ్మ అమ్మవారి జాతర ప్రారంభించిన ఎమ్మెల్యే

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** శ్రీ కుమార రామ భీమేశ్వర స్వామి ఆర్చ్ సమీపంలో ఉన్న సామర్లకోట గ్రామ దేవత శ్రీ మదుగులమ్మ అమ్మవారి ఆలయం వద్ద బుధవారం మధ్యాహ్నం ఆషాడ మాసం సందర్భంగా జాతర మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ జాతర ఉత్సవాలను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ముఖ్య అతిథులుగా పాల్గొని కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. దీనికి ముందు ఎమ్మెల్యే, తెదేపా నాయకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా వివిధ రకాల నృత్యాలు, తీన్మార్, కోయ డాన్స్, తాళ మేళాలతో సామర్లకోట పట్టణ పురవీధుల్లో అంగ రంగ వైభవంగా అమ్మవారి ఉత్సవం కొనసాగించారు. ఈ వేడుకల్లో తెదేపా నాయకులు కంటే జగదీశ్, బదుగు శ్రీకాంత్, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, బలుసు వాసు, వల్లూరి దొరబాబు, జనసేన నాయకులు సరోజ వాసు, ఆలయ కమిటీ నాయ కులు, అర్చకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# రైతు భూమికి రక్షణ... రైతు హక్కుకు భరోసా

**- పాసు పుస్తకాలు, ఇళ్ల పట్టాలు పంపిణీ కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి - కోవూరు గ్రామంలో 939 మంది రైతులకు పాసు పుస్తకాలు - 50 మంది పేదలకు ఇళ్ల పట్టాలు**





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రైతు భూమికి రక్షణ కల్పించడం, రైతు హక్కుకు భరోసా ఇవ్వడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. బుధవారం కోవూరు ఎమ్మార్వో కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన పట్టాదారు పాసుపుస్తకాలు, ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అధికారంలోకి రాగానే భూ సమస్యలను పరిష్కరిస్తామని, రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు ఇస్తామని, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం తప్పిదాల వల్ల అనేక ప్రాంతాల్లో రైతుల సొంత భూములు కూడా 22(ఏ) నిషేధిత జాబితాలోకి వెళ్లాయని తెలిపారు. కోవూరు నియోజకవర్గంలోనూ ఇలాంటి సమస్యలు ఉన్నాయని చెప్పారు. ఇటీవల కొత్తవంగల్లు సమీప గ్రామాల రైతులు తమ సమస్యను తన దృష్టికి తీసుకు వచ్చారని, సుమారు 90 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న దాదాపు 400 ఎకరాలు 22(ఏ)లోకి వెళ్లిన విషయాన్ని రైతులు తెలిపారని వివరించారు. ఈ సమస్యను కలెక్టర్ గారు, జాయింట్ కలెక్టర్ గారు, స్థానిక ఎమ్మార్వో గారి దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. రీసర్వే ద్వారా రైతులకు న్యాయం జరుగుతుందనడానికి ఇదొక నిదర్శనమని అన్నారు.


**939 మంది రైతులకు రాజముద్రతో పాసు పుస్తకాలు**

కోవూరు గ్రామంలో 5,554 ఎకరాలకు రీసర్వే పూర్తి చేశామని, ఇందులో 3,917 ఎకరాల పట్టా భూములకు సంబంధించి 939 మంది రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను ఈ రోజు అందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ పాసు పుస్తకాల్లో రాష్ట్ర రాజముద్రతో పాటు హై-సెక్యూరిటీ యాంటీ ట్యాంపర్ డిజైన్, క్యూఆర్ కోడ్, జియో కోఆర్డినేట్స్ వంటి ఆధునిక భద్రతా ఫీచర్లు ఉన్నాయని చెప్పారు. కోవూరు మండలంలో ఇప్పటికే 9 గ్రామాల్లో రాజముద్రతో కూడిన పాసు పుస్తకాలను పంపిణీ చేశామని తెలిపారు. సాదాబైనామా భూములకు కూడా పాసుపుస్తకాలు అందించే చర్యలు జరుగుతున్నాయని చెప్పారు. 22(ఏ)లో ఉన్న పట్టా భూముల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ఆర్డీవోలకు ప్రభుత్వం అధికారాలు ఇచ్చిందని ఎమ్మెల్యే తెలిపారు. కోవూరు నియోజకవర్గం ప్రధానంగా డెల్టా ప్రాంతం కావడంతో రైతులకు భూమి హక్కులకు సంబంధించిన ఈ కార్యక్రమం ఎంతో ముఖ్యమైనదని అన్నారు. రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు అందించేందుకు కృషి చేస్తున్న అధికారులు, ప్రభుత్వానికి ఎమ్మెల్యే గారు ధన్యవాదాలు తెలిపారు. రైతు భూమికి రక్షణ... రైతు హక్కుకు భరోసా... ఇదే మన ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

**50 మంది పేదలకు ఇళ్ల పట్టాలు**

ఇటుక బట్టీల్లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్న 50 మంది పేదలకు ఈ రోజు ఇళ్ల పట్టాలు కూడా పంపిణీ చేశామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన గిరిజన నాయకులు బాల చిన్నయ్యకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం తరపున, అలాగే వీపీఆర్ ఫౌండేషన్ తరపున గిరిజనులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాఘవేంద్ర, ఎస్సీ నాయకులు బాల చిన్నయ్య, కూటమి నాయకులు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం : జిల్లా కలెక్టర్



**రేణిగుంట, (రాజధాని వార్తలు):** ప్రత్యేక సమగ్ర సవరణ -2026లో భాగంగా ఓటరు జాబితాపై వచ్చిన వినతులు, అభ్యంతరాల విచారణ ప్రక్రియను జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ బుధవారం రేణిగుంట మండలం మామండూరు గ్రామపంచాయతీలో ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విచారణకు హాజరైన అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న కలెక్టర్, ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితాలో పేర్ల చేర్పు, తొలగింపు, వివరాల సవరణ, చిరునామా మార్పు, మ్యాపింగ్ సమస్యలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా పరిష్కరించాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా విచారణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా జాబితాలో చోటు కోల్పోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి, రేణిగుంట తహసీల్దార్ శ్రావణ్ కుమార్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గూడూరులో కదం తొక్కిన కూటమి




**గూడూరు, (రాజధాని వార్తలు):** డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న విమర్శలకు కూటమి ప్రభుత్వం తరపున గూడూరు ఎమ్మెల్యే, రాష్ట్ర టిడిపి ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాశిం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో భారీ సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. గూడూరు టవర్ క్లాక్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ర్యాలీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా డీఎస్సీ ద్వారా 16,500 మందికి ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. ఐదేళ్లు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ఒక్క టీచర్ ఉద్యోగమైనా కల్పించిందా అని ప్రశ్నించారు. డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు కల్పించడంతో వైసీపీ నేతలు లోకేష్‌ను చూసి భయ పడుతున్నారని విమర్శించారు. గూడూరులో పరిచయ కార్యక్రమాల పేరుతో కూటమి ప్రభుత్వాన్ని, మంత్రి నారా లోకేష్‌ను విమర్శిస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని, తాము తలచుకుంటే అంతకంటే ఎక్కువ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయగలమని అన్నారు. డీఎస్సీ నియామకాల్లో ఎలాంటి అవకతవకలు జరగలేదని, మెరిట్ ప్రాతిపదికనే ఉద్యోగాలు భర్తీ చేశామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. 16,500 ఉద్యోగాలు కల్పించినందుకు లోకేష్ రాజీనామా చేయాలా? అని ప్రశ్నించారు. గూడూరు ఎస్సీ నియోజకవర్గమని, ఇక్కడ కొందరు కావాలనే గొడవలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. "మా సహ నాన్ని పరీక్షించవద్దు.. మేము తలచుకుంటే పరిస్థితి వేరే విధంగా ఉంటుంది" అని హెచ్చరించారు. తాము తాము కొట్టుకుని చస్తుంటే కొందరు చూస్తూ ఉండాలని ప్రయత్నిస్తున్నారని వ్యాఖ్యానించారు. వైసీపీలో అందరూ చెడ్డవారు కాదని, అయితే కొందరి చర్యల వల్ల సమస్యలు వస్తున్నాయని అన్నారు. తమ నాయకుడు తమకు క్రమశిక్షణ నేర్పించారని, అందుకే సంయమనంతో వ్యవహరిస్తున్నామని తెలిపారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో యువత ఉద్యమించి విజయం సాధించిందని పేర్కొన్న ఎమ్మెల్యే.. యువత సమస్యలపై తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని అన్నారు. ఈరోజు నిర్వహించిన డీఎస్సీ సంఘీభావ ర్యాలీతో గూడూరులో కూటమి బలం ఏమిటో వైసీపీకి తెలిసిందని పాశిం సునీల్ కుమార్ పేర్కొన్నారు. ఈ ర్యాలీలో టిడిపి రాష్ట్ర నాయకులు శీలం కిరణ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి, ఏపీ లైవ్ స్టాక్ ఏజెన్సీ డైరెక్టర్ గుండాల లీలావతి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బిల్లు చెంచు రామయ్య, టిడిపి నాయకులు, బిజెపి పట్టణ అధ్యక్షులు, కే దయాకర్, జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు, శివాలయం చైర్మన్, అరికట్ల బాలకృష్ణ నాయుడు, బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి రవీంద్ర, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మధిర సునీల్ కుమార్, జనసేన గూడూరు నియోజకవర్గ ఇన్చార్జి కే.మోహన్, భారీ సంఖ్యలో కూటమి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# దేశభక్తి ఉప్పొంగేలా హర్‌ఘర్ తిరంగా ర్యాలీ

**- నెల్లూరు కలెక్టరేట్ నుంచి ప్రారంభమైన తిరంగా ర్యాలీని ప్రారంభించిన రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి - 275 అడుగుల జాతీయ జెండాతో భారీగా కొనసాగిన హర్‌ఘర్ తిరంగా ర్యాలీ**





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఆగస్టు 15వ తేదీన నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముందుగా నెల్లూరు జిల్లాలో తిరంగా ర్యాలీతో సంబరాలకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఉదయం కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆధ్వర్యంలో 275 అడుగుల జాతీయ జెండాతో భారీగా నిర్వహించిన తిరంగా ర్యాలీని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, డీఆర్‌వో విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వై.ఓ.నందన్, అధికారులు, విద్యార్థులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ర్యాలీలో పాల్గొని దేశభక్తి ఉప్పొంగేలా నినాదాలు చేస్తూ విఆర్‌సి వరకు ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఆగస్టు 15వ తేదీ వరకు జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. "పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్" పేరుతో చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా తిరంగా ర్యాలీతో కార్యక్రమాలను ప్రారంభించామని, అనంతరం మొక్కలు నాటే కార్యక్రమం, సోషల్ మీడియా క్యాంపెయిన్ తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆగస్టు 15న పరేడ్ గ్రౌండ్స్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజల్లో దేశభక్తి, జాతీయ సమైక్యత, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల పట్ల గౌరవ భావాన్ని మరింత పెంపొందించడమే తిరంగా ర్యాలీ ప్రధాన ఉద్దేశమన్నారు.

ప్రతి ఒక్కరూ కలిసి మెలిసి భారతదేశ ఔన్నత్యం, దేశ సౌభాగ్యం కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులు సమష్టిగా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. తిరంగా ర్యాలీ ద్వారా నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించే దిశగా అందరూ కలిసి ముందుకు సాగాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ హర్ ఘర్ తిరంగా ర్యాలీలో విద్యార్థిని విద్యార్థులు, అధికారులు, స్థానిక ప్రజలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# వృద్ధురాలి స్థల వివాదంపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలి




**తిరుపతి, (రాజధాని వార్తలు):** సమగ్ర న్యాయం కోసం వృద్ధాప్యంలో ఉన్న ఓ మహిళ స్థానిక నాయకులతో, కబ్జాదారులతో, రౌడీ మూకలతో పోరాడి చివరకు అధికారులతో సైతం పోరాడుతూ, న్యాయం చేయాల్సిన పోలీసులే తమకు తీవ్ర అన్యాయం చేశారని విసుగుచెంది మన తిరుపతి ప్రెస్ క్లబ్‌కు చేరి తమ గోడును కన్నీళ్ళతో విలపించారు. తిరుపతి అర్బన్ మండలం అక్కారంపల్లి గ్రామ లెక్క దాఖలా ఉపాధ్యాయనగర్ మారస సరోవరం హోటల్ సమీపంలో ఉన్న 150 అంకణాల స్థలానికి సంబంధించి వృద్ధురాలు రుద్రరాజు సంపూర్ణమ్మకు న్యాయబద్ధమైన హక్కులు ఉన్నాయని, రిజిస్ట్రేషన్ పత్రాలు తమ వద్ద ఉన్నాయని 80 ఏళ్ల బాధితురాలు ఆర్.సంపూర్ణమ్మ, కూతురు నీరజ, అల్లుడు సుకుమార్ తెలిపారు. అయితే తమ స్థలాన్ని ఇతరులకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ వ్యవహారంలో గతంలో అలిపిరి పోలీస్ స్టేషన్‌లో పని చేసిన ఎస్ఐ లోకేష్ కుమార్ కొంతమంది వ్యక్తుల పాత్రపై తమకు అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. అదేవిధంగా సంబంధిత స్థలంలో బాధితులు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలు, సోలార్ ప్లాంట్, గదులు, మానవతా సంస్థ వాహనం కోసం నిర్మించిన షెడ్ మొక్కలు, బోరు తదితర ఆస్తులు ధ్వంసం చేయబడ్డాయని 10 లక్షల పైగా నష్టపోయామని దీనికి కారణం అలిపిరిఎస్ఐ లోకేష్ కుమార్ ఎక్సైజ్ సీఐ జవహర్ బాబు, టీటీడీ డిప్యూటీఈవో ఆనంద రాజు, భూకం రమేష్ అన్న రామకృష్ణ, హేమ హేప్సీబా లీనా వినోలియా జాన్ డబ్ల్యు పాలస్తీన్ విజయ్ వెంకటరత్నంలతో పాటు 20 మందిపైగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి అలిపిరి పోలీస్ స్టేషన్‌లో గతంలో నమోదైన క్రైమ్ నంబర్ 180/2025 కేసులో సంబంధిత అధికారుల పాత్రపై కూడా సమగ్ర విచారణ జరిపి చట్టప్రకారం బాధ్యత నిర్ణయించాలని బాధితులు కోరుతున్నారు. ఈ వ్యవహారంలో రాజకీయ నాయకులు లేదా ఉన్నతాధికారుల పేర్లు ప్రస్తావిస్తూ తమపై ఒత్తిడి తీసుకు వస్తున్నారని బాధితులు తెలిపారు. అయితే, ఈ ఆరోపణలన్నింటినీ సంబంధిత అధికారులు స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా విచారించి వాస్తవాలను నిర్ధారించాలని మన తిరుపతి ప్రెస్ క్లబ్ కోరుతోంది. వృద్ధురాలికి సంబంధించిన స్థల హక్కులు, రిజిస్ట్రేషన్ పత్రాలు, రెవెన్యూ రికార్డులు, గతంలో జరిగిన లావాదేవీలు, పోలీస్ కేసులు, ఆస్తుల ధ్వంసానికి సంబంధించిన ఆధారాలను పరిశీలించి సమగ్ర విచారణ చేపట్టాలి. బాధితులకు ఎటువంటి అన్యాయం జరగకుండా, చట్టబద్ధమైన హక్కులు కలిగిన వారికి రక్షణ కల్పించి, న్యాయపరమైన నిర్ణయం తీసుకోవాలని సంబంధిత రెవెన్యూ పోలీస్ ఉన్నతాధికారులను కోరుతున్నారు.

# శ్రావణి రెడ్డి ఆధ్వర్యంలో డీఎస్సీ సంఘీభావ ర్యాలీకి భారీగా తరలిన పార్టీ శ్రేణులు



**గూడూరు, (రాజధాని వార్తలు):** డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న విమర్శలకు కూటమి ప్రభుత్వం తరపున గూడూరు ఎమ్మెల్యే, రాష్ట్ర టిడిపి ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాశిం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో భారీ సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ సంఘీభావ ర్యాలీకి రాష్ట్ర టిడిపి కార్యదర్శి, కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు మట్టం శ్రావణి రెడ్డి ఆధ్వర్యంలో చెన్నూరు గ్రామం నుండి భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా శ్రావణి రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డీఎస్సీ ద్వారా 16,500 మందికి ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. ఐదేళ్లు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ఒక్క టీచర్ ఉద్యోగమైనా కల్పించిందా అని ప్రశ్నించారు. డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు కల్పించడంతో వైసీపీ నేతలు లోకేష్‌ను చూసి భయపడుతున్నారని విమర్శించారు. డీఎస్సీ నియామకాల్లో ఎలాంటి అవకతవకలు జరగలేదని, మెరిట్ ప్రాతిపదికనే ఉద్యోగాలు భర్తీ చేశామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. 16,500 ఉద్యోగాలు కల్పించినందుకు లోకేష్ రాజీనామా చేయాలా? అని ప్రశ్నించారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో యువత ఉద్యమించి విజయం సాధించిందని పేర్కొన్న ఎమ్మెల్యే.. యువత సమస్యలపై తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని అన్నారు. ఈ ర్యాలీ కార్యక్రమంలో టిడిపి నాయకులు మట్టం మురళి ఇందుకూరు శ్రీకాంత్ రెడ్డి, చెన్నూరు నీటి సంఘం అధ్యక్షులు హేమ కుమార్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ మల్లి శ్యామల, పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# సంపాదకీయం

## జెన్‌జీ: కొత్త తరమా, పాత చట్రమా?

'జెన్ జీ' అన్నది ఇప్పుడు నూతన ఉత్సాహాన్ని గుర్తుకు తెచ్చే పదం. ఈ 'జెన్ జీ' తరానికి ఇప్పుడో హీరో వర్షిప్ ఏర్పడింది. ఈ తరం ముందు తరాల్లా కాదనీ; భిన్నమైన ఆలోచనలతో ప్రతిదాన్నీ ప్రశ్నించే తరమనీ అంతా చెప్పుకుంటున్నారు. ప్రతి ఉద్యమం ఏదో ఒక తాత్కాలిక లక్ష్యంతోనే మొదలవుతుంది. కానీ అది వదిలివెళ్లే పాదముద్రలు దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపుతాయి. మన స్వాతంత్ర్యోద్యమం మొదలుకొని, చైనా సాంస్కృతిక విప్లవం దాకా ఎన్నో ఉద్యమాలు తాత్కాలిక విజయం కోసమే పని చేసినప్పటికీ, తదనంతరం ఆయా సమాజాల్లోని విలువలను ఎలా తలకిందులు చేశాయో చూశాం. ప్రతి ఉద్యమం తెచ్చే మార్పు ఆహ్వానించదగ్గదే. అయితే ఆ ఉద్యమం ప్రకటించిన భావనలు, విధానాలు, తీరుతెన్నులు... ప్రతి ఒక్కటీ సరైనదే అని మాత్రం చెప్పలేం. కార్పొరేట్ పరిభాషలో చెప్పాలంటే- ప్రొడక్ట్ మంచిదే కావచ్చు, కానీ అది తయారు చేయడానికి వాడిన టెక్నాలజీ కలగజేసిన వాతావరణ కాలుష్యం, దాని పరిణామాలు కొంతకాలం తర్వాతే తెలుస్తాయి. జెన్ జీ అన్నది నేటి యువతరానికి వాడుతున్న పర్యాయపదం. అంటే మానవ చరిత్రలో, పుట్టుకతోనే మొబైల్ ఫోన్స్, ఇంటర్నెట్, డిజిటల్ టెక్నాలజీని చూస్తూ వచ్చిన మొట్టమొదటి తరం. దీని ముందుతరం 'మిలీనియల్స్' (1981-96 మధ్యలో పుట్టినవాళ్లు). 'అనలాగ్', 'డిజిటల్' తరాన్ని ఒకేసారి చూస్తూ దానిని 'అడాప్ట్' చేసుకున్న మొదటి తరం ఈ మిలీనియల్స్. వీళ్లను సాధారణంగా 'అడాప్టబిలిటీ'కి ప్రతీకలుగా చూస్తారు. అంటే ఏ కొత్త మార్పుకైనా సులువుగా మారిపోతారు అని. ఇంతకు ముందు కూడా యువతరాలు సమాజాన్ని ప్రశ్నించి ఉద్యమాలు చేసిన సందర్భాలెన్నో ఉన్నాయి. 'నవనిర్మాణ్ ఆందోళన్' అని గుజరాత్‌లో 1974లో హాస్టల్ మెస్ చార్జీలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం చివరకు అక్కడి ముఖ్యమంత్రి రాజీనామాకు దారితీసింది. తమాషాగా అదే రాజకీయ నాయకుడు చిమన్‌భాయ్ పటేల్ సొంత పార్టీని స్థాపించి (కిసాన్ మజ్దూర్ లోక్ పక్ష్) 1975 ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేశారు, ఆపై 1990లో మళ్లీ గుజరాత్ ముఖ్యమంత్రిగా తిరిగి వచ్చారు. అది వేరే సంగతి. తెలంగాణ ఉద్యమాన్ని దగ్గరుండి నడిపింది అప్పటి యువతరమైన విద్యార్థులే. రోహిత్ వేముల మరణాన్ని నిరసిస్తూ నడిచింది అప్పటి తరం విద్యార్థులే. ఇలా చరిత్ర చూస్తే, ప్రతి తరమూ తమ కాలంలో ఏవో ఉద్యమాలు చేసి సంచలనాలు సృష్టించినదే. ఆ యువత తర్వాత ఎదిగి మళ్లీ అవే సామాజిక దురాచారాలను వెంటవేసుకునే తరాల్లో కలిసిపోయింది. ఇది చరిత్ర చెప్పిన నిజం. కాబట్టి ప్రస్తుతం 'జెన్ జీ'కి ఒక అసాధారణమైన హీరో వర్షిప్ కట్టబెట్టే ముందు ఆలోచించాల్సింది ఏమంటే- ఈ తరం ఏ విలువలను ముందుకు తీసుకెళ్లగలుగుతుంది అన్నది. ఈ జెన్ జీ ఇంటికెళ్లాక మళ్లీ అదే 'ఎండోగమీ'లో పడిపోయి ఎవరి కులాల పిల్లలను వాళ్లు పెళ్లి చేసుకుని, తర్వాత ఆ కులాల్లోనే పిల్లల్ని కని, కంటిన్యూ చేయడమే జరుగుతుంది. ఇక్కడ సమస్య ఏమిటంటే- 'జెన్ జీ' అనేది ఒక హోమోజీనస్ గుంపు కాదు. దీనికి ఒక ఐడెంటిటీని ఆపాదించలేం. ఇది నిర్ద్వంద్వంగా 'హెటిరోజీనస్ గ్రూప్' (విభిన్నతల సమూహం). ఈ ఉద్యమంలో సినిమా పాటలకు డాన్సులు వేస్తూ, చప్పట్లు కొడుతూ నాట్యాలు చేసే యువతను చూసినప్పుడు ఇది సమస్యపై తీవ్రంగా పోరాడే గుంపులా గాక, తమకుండే మూక బలాన్ని ఎంజాయ్ చేసే గుంపులా మాత్రమే కనిపించింది. ఆ వినోదం వాళ్లను ఒకటి చేసింది, వాళ్లంతా కలిసి ఒక సమస్యను ఎదుర్కొన్నారు. అది సంతోషదాయకమైన విషయం. కానీ ప్రతి ఉద్యమమూ ఒక దుఃఖ సన్నివేశం నుంచి పుడుతుంది. ఉద్యమ క్రమంలో ఆ భావావేశాన్ని వెనక్కు నెట్టివేయడం 'జెన్ జీ' ఏ కాదు, అది ఎవరు చేసినా అసంబద్ధమే. ఒక మూర్ఖత్వాన్ని తృణీకరించాలంటే అందుకు సరైన మాధ్యమం వ్యంగ్యం (సెటైర్ లేదా సర్కాజం). 'జెన్ జీ' విషయంలో ఇది వ్యంగ్యాన్ని దాటి, బూతు రూపం కూడా తీసుకుంది, సందట్లో సడేమియాలాగా దానికి ఒక ఆమోద ముద్ర కూడా పడిపోతున్నది. ఇప్పటికిప్పుడు 'జెన్ జీ' ఉద్యమానికి అనుబంధంగా పుట్టిన విలువలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం లేదు. కానీ ఆ విలువలను విమర్శనాత్మకంగా గమనించాల్సి ఉంది. గాంధీ పక్కన అంబేడ్కర్ ఫొటో పెట్టడంతోటే ఈ ఉద్యమంలో ఉన్న తీవ్రమైన రాజీ స్వభావం లీలగా అర్థం అవుతున్నది. రోహిత్ వేముల మరణం తర్వాత మిలీనియల్స్ వ్యవస్థకు వ్యతిరేకంగా విస్తృత పోరాటం చేశారు. కానీ అది ఒక కులానికి సంబంధించిన పోరాటంగా ఉండిపోవడం వల్ల, ఆ తరానికి హీరోయిజం ఆపాదించబడలేదు. ఇప్పుడు 'జెన్ జీ'కి దొరికిన సింపతీని నాడు అన్యాయానికి నిర్ద్వంద్వంగా ఎదురు తిరిగి, యూనివర్సిటీ హాస్టల్స్ నుంచి వెలివేయబడ్డ మిలీనియల్స్ దక్కించుకోలేకపోయారు. సెప్టెంబర్ 2025లో ఢిల్లీ యూనివర్సిటీ ఎన్నికలను గమనిస్తే, ఆరెస్సెస్ అనుబంధ విద్యార్థి సంస్థ అయిన ఏబీవీపీ ఈ ఎన్నికల్లో ఘన విజయం సాధించింది. అది అలా గెలిచింది ఈ 'జెన్ జీ' ఓట్లతోనే. ఇదే 'జెన్ జీ' హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఎన్నికల్లో కూడా ఏబీవీపీనే ఎన్నుకుంది. కాబట్టి ఈ 'జెన్ జీ' తరం ఇంతకుముందు తరాలకు భిన్నంగా ఏమీ లేదు, ముఖ్యంగా ఇందులో హెటిరోజినిటీని తగు మోతాదులో కలుపుకునే ఉంది. ఈ తరాన్ని 'ఇన్‌స్టా' తరం అనవచ్చు. మిలీనియల్స్ 'ఫేస్‌బుక్'ను ఆదరించినంతగా వీళ్లు ఆదరించలేదు. ఇది 2017 నుంచి కనిపించడం మొదలుపెట్టింది. రెండు నిమిషాల రీల్స్‌లో విషయం అంతా తెలియాలని తాపత్రయపడే ఈ తరానికి అనుగుణంగా మార్కెటింగ్ యాడ్స్ రూపుదిద్దుకోవడం మొదలైంది. ఈ జెన్ జీ ఇన్‌స్టా తరం పూర్తిగా డిజిటల్ యుగంలో పెరగడం వల్ల సులువైన పనులకు అలవాటుపడిన తరంగా మారింది.

# 60 కిలోల గంజాయితో ఐదుగురు మహిళలు అరెస్ట్

### - రూ.30 లక్షలకు పైగా విలువ ఉంటుందని అంచనా




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో భారీగా గంజాయి పట్టుబడింది. సుమారు 60 కేజీల గంజాయిని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకుని ఐదుగురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. రైల్వే సీఐ శ్రీనివా సరెడ్డి, ఎస్ఐ వాసులు దీనిపై వివరాలు వెల్లడించారు. సామర్లకోట రైల్వే స్టేషన్‌లోని 2, 3వ నంబర్ ప్లాట్‌ఫామ్‌ల చివర ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఐదుగురు మహిళలను గుర్తించి అదుపులోకి పోలీసులు తీసుకున్నారు. ఈ సందర్భంగా వారి వద్ద తనిఖీలు చేయగా 60 కిలోల గంజాయి లభించినట్లు పోలీసులు చెప్పారు. పట్టుబడిన గంజాయి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ. 30 లక్షలకు పైగానే ఉంటుందని వారు అంచనా వేస్తున్నారు. విచారణలో పట్టుబడిన మహిళలు నెల్లూరు జిల్లా బిట్రగుంట ప్రాంతానికి చెందినవారిగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. రాయగడ సమీపంలోని టిక్రి గ్రామం నుంచి ఓ వ్యక్తి వద్ద కిలో గంజాయిని సుమారు రూ. 1,000 చొప్పున కొనుగోలు చేసి, బిట్రగుంట ప్రాంతంలో చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తు న్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ వాసు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, పట్టుబడిన ఐదుగురు మహిళలను విజయవాడ కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు. కాగా గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తితో పాటు ఈ అక్రమ రవాణా వెనుక మరికొందరి ప్రమేయం ఉందా అనే కోణంలో దర్యాప్తు కొనసాగిస్తున్నట్టు సిఐ, ఎస్ఐలు చెప్పారు.

# ప్రభుత్వ పనితీరు,అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకు వెళ్లాలి

**అమలాపురం, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలలోనికి తీసుకు వెళ్లాలని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు అమలాపురం రూరల్ మండలం పేరూరు, అమలాపురం పట్టణం మెట్ల రమణ బాబు ఇంటి వద్ద జరిగిన ప్రతి బుధవారం క్రమం తప్పకుండా నిర్వహించే "క్యాడర్ క్యాలెండర్" మండల స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే ఆనందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న పథకాల ఫలాలను ప్రతీ ఇంటికీ చేర్చాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సుపరి పాలనను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలో నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా



కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అమలాపురం తదితర మండలాల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, క్లస్టర్, కో-క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లు, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జ్‌లు, స్థానిక ప్రజాప్రతినిధులు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# పంచాయితీ పాలనపై ప్రజల్లో గౌరవం పెంచాలి



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ప్రజల విశ్వాసం పొందేలా పనిచేసి పంచాయతీ రాజ్ శాఖ గౌరవం మరింతగా పెంచాలని సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ కెవిన్వి ప్రసాద రావు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన డిప్యూటీ ఎంపీడీవోలకు స్థానిక విస్తరణ శిక్షణా కేంద్రంలో జరిగిన 30 రోజుల ప్రాథమిక శిక్షణ బుధవారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపల్ ముఖ్యఅతిథిగా పాల్గొని శిక్షణార్థులకు సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. ముగింపు అనంతర పరీక్షలో మంచి మార్కులు సాధించిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. పదోన్నతుల ద్వారా ఏ పోస్ట్‌కి వెళ్ళినా ఆ పోస్టుకు న్యాయం చేసేలా పరిజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. ఉద్యోగ నిర్వహణకు శిక్షణలు ఎంతో దోహదం చేస్తాయని, వాటి ద్వారా నైపుణ్యాలు పెంచుకోవాలని ప్రసాద రావు అన్నారు. ఈ కార్యక్రమంలో డిడిఓ శర్మ, ఎంపీడీవో శేషుబాబు, ఫ్యాకల్టీ సభ్యులు చిన్నబ్బులు, చక్రపాణి, నిహారిక, జగన్నాథం, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**"వీబీ జి రామ్ జి" ద్వారా 169 మంది ఎంపీడీవోలకు శిక్షణ:**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో వచ్చిన "వీబీ జి రాం జి" పథకంపై వివిధ జిల్లాలకు చెందిన ఎంపీడీవోలు 169 మందికి సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రంలో ఆరు బ్యాచులుగా శిక్షణ ఇచ్చినట్టు ప్రిన్సిపల్ తెలిపారు. గ్రామీణ ఉపాధిలో కీలకమైన ఈ పథకంలో వచ్చిన మార్పులపై వారికి అవగాహన కల్పించినట్టు ఆయన పేర్కొన్నారు.

# ప్రతి ఒక్కరిలో స్వాతంత్ర పోరాట స్ఫూర్తిని, దేశభక్తి పెంపొందించుకోవాలి

**అమలాపురం, (రాజధాని వార్తలు):** దేశ స్వాతంత్ర్య దినోత్సవ వారోత్సవాలు, 'స్త్రీ శక్తి' పథకం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా అమలాపురం నియోజకవర్గంలో తిరంగా యాత్ర వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా అమలాపురం రూరల్ మండలం పేరూరులో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు నాయకత్వంలో బుధవారం భారీ తిరంగా యాత్ర బైక్ ర్యాలి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని, దేశభక్తిని ప్రతి ఒక్కరిలో పెంపొందించడమే లక్ష్యంగా మువ్వ న్నెల త్రివర్ణ పతాకాన్ని చేత భూని ఈ తిరంగా యాత్ర చేపట్టామన్నారు. ఆగస్టు 12 నుండి 15 వరకు నియోజకవర్గంలోని ప్రతి ఇంటిపైనా, వ్యాపార సంస్థలపైనా జాతీయ జెండాను రెపరెపలాడించాలని, ప్రతి ఒక్కరూ 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తిరంగా యాత్ర బైక్ ర్యాలీలో పాల్గొన్న నాయకులు,



కార్యకర్తలకు జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, క్లస్టర్, యూనిట్, బూత్, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అక్రమాలను ప్రశ్నిస్తే కేసులు పెడతారా

### - డీఎస్సీ అక్రమాలపై పోరాటం ఆపేది లేదు
### - కేసులకు, అరెస్టులకు వైయస్ఆర్సీపీ భయపడదు : మాజీ ఎంపీ అనురాధ



**అమలాపురం, (రాజధాని వార్తలు):** ఏపీ డీఎస్సీ నియామకాల్లో జరిగిన అవకతవకలు, అక్రమాలను ప్రశ్నిస్తే ప్రభుత్వం కేసులు పెడతారా అంటూ అమలాపురం మాజీ ఎంపీ చింతా అనురాధ మండిపడ్డారు. ఏపీ డీఎస్సీ అక్రమాలపైన, నిరుద్యోగ భృతి, పెండింగ్ ఫీజ్ రియంబర్స్మెంట్ నిధులు విడుదలపై వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అమలాపురంలో చేపట్టిన నిరసన ర్యాలీ సందర్భంగా వైయస్ఆర్సీపీ నాయకులపై పోలీసులు కేసులు నమోదు చేయడాన్ని అనురాధ తీవ్రంగా ఖండిం చారు. అక్రమాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడ తారా ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, ప్రజల తరపున నిరసన చేపట్టడం ప్రతిపక్షానికి ఉన్న హక్కని ఆమె అన్నారు. సెక్షన్ 30 అమలులో ఉందంటూ నిరసన కార్యక్రమాలను అడ్డుకోవడం, నాయకులపై కేసులు నమోదు చేయడం కూటమి ప్రభుత్వ అణచివేత ధోరణికి నిదర్శనమని ధ్వజమె త్తారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కూటమి ప్రభుత్వం తమను ప్రశ్నించే వైయస్ఆర్సీపీ నాయ కులపై కేసులు పెట్టడం, అరెస్టులు చేయడం, ఇబ్బం దులకు గురి చేయడం ఒక పనిగా పెట్టుకుందని అనురాధ మండిపడ్డారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షే మంపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం ప్రతిపక్షాన్ని వేధించడంపైనే ఎక్కువ దృష్టి పెడుతోందని విమర్శిం చారు. డీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపే వరకు, ఈ అక్రమా లకు బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేసే వరకు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరా టం కొనసాగుతూనే ఉంటుందని అనురాధ స్పష్టం చేశారు. ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని అరెస్టులు చేసినా వైయస్ఆర్సీపీ వెనక్కి తగ్గేదే లేదని స్పష్టం చేశారు.

# స్వతంత్ర ఉద్యమంలో సామర్లకోట కేంద్ర బిందువు

### - గోడపత్రికల ఆవిష్కరణ



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** తూర్పుగోదావరి జిల్లాలో స్వాతంత్ర ఉద్యమంలో కేంద్ర బిందువుగా నిలిచిన ప్రాంతం సామర్లకోట రైల్వే స్టేషన్ అని వంగలపూడి శివకృష్ణ అన్నారు. బుధవారం సామర్లకోట రైల్వే స్టేషన్ వద్ద స్వాతంత్ర ఉద్యమంలో సామర్లకోట పెద్దాపురం పుస్తక ఆవిష్కరణకు సంబంధించి గోడపత్రికను రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం రమేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భం గా పుస్తక రచయిత వంగలపూడి శివకృష్ణ మాట్లాడుతూ 1893లో నిర్మించిన సామర్లకోట రైల్వే స్టేషన్‌కు ఎంతో మంది మహనీయులు మహాత్మా గాంధీ, సుభాష్ చంద్రబోస్, మౌలానా మహమ్మద్ అలీ, జవహర్లాల్ నెహ్రూ, సరోజినీ నాయుడు, సర్దార్ వల్లభాయ్ పటేల్ వంటి స్వాతంత్ర ఉద్యమకారులు సామర్లకోటకు విచ్చేసి సభలో సమావేశాలు నిర్వహించి సామర్లకోట పెద్దాపురం లోనీ పౌరులను స్వాతంత్ర ఉద్యమంలోకి ప్రోత్సహించడం జరిగిందన్నారు. స్వాతంత్ర ఉద్యమంలో సామర్లకోట, పెద్దాపురం సంబంధించి పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని 14వ తేదీ శుక్రవారం సాయంత్రం పెద్దాపురం మున్సిపల్ కార్యాలయం సమీపన గల మహాత్మా గాంధీ పార్క్‌నందు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం రైల్వే స్టేషన్ మేనేజర్ రమేష్ మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో భాగస్వాములైన ఎంతోమంది మహానుభావులు సామర్లకోట రైల్వే స్టేషన్‌కి రావడం జరిగిందని, దానికి సంబంధించి ఆనాటి విషయాలు గుర్తు చేస్తూ రచయిత వంగల పూడి శివరామకృష్ణ గోడపత్రికను ఆవిష్కరించడం జరిగిందన్నారు. తన రచనల ద్వారా ప్రజలను చైతన్య పరచడం అభినందనీయమన్నారు. సుసం పన్నమైన దేశం భారతదేశమని, ప్రతి పౌరుడు బాధ్యతగా తమ బాధ్యతలు నిర్వహిస్తూ, పౌరులు అందరూ దేశాభివృద్ధికి కృషి చేస్తూ, ప్రతి ఒక్కరూ బాధ్యతగా నడుచుకుంటూ, దేశానికి మంచి పేరు తీసుకు రావాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో గణితవధాని తోటకూర సాయి రామకృష్ణ, సామర్లకోట ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు, జనసేన నాయకులు సరోజ వాసు, మడగల శ్యామ్, రెడ్డిపల్లి రమణమూర్తి, పెదిరెడ్డి నరేష్, క్రాంతి కుమార్, కరణం భాను, బాలం హరి, సిరిపురపు శ్రీనివాస్, విల్లా లక్ష్మి వడ్డి సత్యనారాయణ, నవీన్ నాని, రాజేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రెండేళ్లు నరకం చూశాను.. బ్రేకప్‌పై అనుపమ ఏమన్నారంటే?



టాలీవుడ్ యంగ్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ తన గతానికి సంబంధించిన పలు సంచలన విషయాలను వెల్లడించింది. గతంలో రెండేళ్ల పాటు ఒక వ్యక్తితో రిలేషన్‌షిప్‌లో ఉండి 'నార్సిసిస్టిక్ అబ్యూజ్'కు గురయ్యానని, శారీరకంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నానని తెలిపింది. ఒక ప్రముఖ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాలను పంచుకున్నప్పటికీ, ఆ వ్యక్తి ఎవరనేది మాత్రం ఆమె చెప్పలేదు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. ఆ వివరాలు ఇప్పుడు చూద్దాం..

**ప్రేమ పేరుతో ఆంక్షలు:**

ప్రేమ పేరుతో తన జీవితంలోకి వచ్చిన ఆ వ్యక్తి, నన్ను పూర్తిగా తన అదుపులో ఉంచుకోవాలని ప్రయత్నించాడని అనుపమ చెప్పింది. ఇక తాను ధరించే దుస్తులు, సోషల్ మీడియా పోస్టులు, చివరికి ఎంచుకునే సినిమాల విషయంలోనూ ఆయనే ఆంక్షలు విధించేవాడని తెలిపింది. అంతేకాకుండా, అసలు నటనకు స్వస్తి పలకాలని కూడా తనపై తీవ్ర ఒత్తిడి తెచ్చేవాడని ఆవేదన వ్యక్తం చేసింది.

**3 నెలల్లోనే ఎంగేజ్‌మెంట్ ఒత్తిడి:**

పరిచయమైన కేవలం మూడు నెలలకే ఆయన కుటుంబం నిశ్చితార్థం, వివాహం చేసుకోవాలని బలవంతం చేశారని అనుపమ బయటపెట్టింది. ఇక ఆ వ్యక్తి వయసులో చాలా చిన్నవాడని, అది ప్రేమ కంటే తనను పూర్తిగా నియంత్రించే ప్రయత్నంగా అనిపించడంతో తాను ఆ ప్రతిపాదనను వాయిదా వేస్తూ వచ్చానని వివరించింది. ఇక ఆ బంధంలో తనకు ఏమాత్రం స్వేచ్ఛ లేకపోవడంతో మానసికంగా నలిగిపోయానని పేర్కొంది.

**క్యారవాన్‌లో ఏడ్చేదాన్ని:**

ఈ విషపూరితమైన బంధం కారణంగా తాను తీవ్రమైన డిప్రెషన్‌లోకి వెళ్లిపోయానని, ఆందోళనకు గురై బరువు కూడా తగ్గానని అనుపమ చెప్పింది. ఇక షూటింగ్ సెట్స్‌లో ఉన్నప్పుడు క్యారవాన్‌లోకి వెళ్లి ఒంటరిగా ఏడ్చేదాన్నని, తరచూ పానిక్ ఎటాక్స్‌కు గురయ్యేదాన్నని తెలిపింది. చివరికి తన సొంత తమ్ముడిని తాకడానికి కూడా భయపడేంతగా ఆ వ్యక్తి తనను మానసికంగా వేధించాడని ఆవేదన చెందింది.

**'డ్రాగన్' ప్రమోషన్లకు దూరంగా:**

తన కెరీర్‌లో అతిపెద్ద విజయాన్ని అందుకున్న 'డ్రాగన్' సినిమా ప్రమోషన్లకు కూడా ఈ మానసిక వేదన కారణంగానే హాజరు కాలేకపోయానని అనుపమ గుర్తుచేసుకుంది. ఆ వ్యక్తి తన్ను డ్రాగన్ ప్రమోషన్లకు వెళ్లనివ్వలేదని సంచలన నిజం బయటపెట్టింది. ఇక చాలా కాలం తర్వాత ఈ మానసిక గాయం నుంచి కోలుకున్నానని, తన అనుభవం ఇతరులకు ఒక హెచ్చరికగా నిలవాలనే ఉద్దేశంతోనే ఈ విషయాలను బహిర్గతం చేశానని అనుపమ స్పష్టం చేసింది. అనుపమ చేసిన ఈ షాకింగ్ వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. ఆ వ్యక్తి ఎవరై ఉంటారా అని నెటిజన్లు ఆరా తీస్తున్నారు. ఏది ఏమైనా, అలాంటి విషపూరిత బంధం నుంచి బయటపడి మళ్లీ కెరీర్‌పై దృష్టి పెట్టి ధైర్యంగా ముందుకు సాగుతున్న అనుపమను అభిమానులు, సినీ ప్రముఖులు ప్రశంసిస్తున్నారు.

# భాస్ ఫుల్ ఇన్‌వాల్వ్.. 'ఫౌజీ' మూవీపై మైత్రి రవి హైప్!



పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్, ప్రతిభావంతుడైన దర్శకుడు హను రాఘవపూడి కాంబినేషన్‌లో వస్తున్న భారీ చిత్రం 'ఫౌజీ'. ఈ సినిమాపై ఇప్పటికే ఇండస్ట్రీలోనూ, అభిమానుల్లోనూ అపారమైన అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల భీమవరంలో జరిగిన రవితేజ 'ఇరుముడి' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో మైత్రీ మూవీ మేకర్స్ అధినేత నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తికర విశేషాలు పంచుకున్నారు. ప్రభాస్ డెడికేషన్ గురించి నిర్మాత రవి చేసిన వ్యాఖ్యలు ఫ్యాన్స్ జోష్‌ను పెంచేసాయి. ఆ విశేషాలు చూద్దాం..

**భీమవరం వేదికగా 'ఫౌజీ' అప్‌డేట్:**

రవితేజ నటించిన 'ఇరుముడి' సినిమా ప్రచారంలో భాగంగా భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో ట్రైలర్ లాంచ్ వేడుక ఘనంగా జరిగింది. ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజుతో పాటు పలువురు ప్రముఖులు హాజరైన ఈ వేదికపై, నిర్మాత మైత్రి రవి ప్రభాస్ అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ అందించారు. ఇక 'ఫౌజీ' షూటింగ్ అప్‌డేట్ ఇస్తూ కాలేజీ ప్రాంగణాన్ని అభిమానుల ఈలలతో నింపేశారు.

**సెట్స్‌లో ప్రభాస్ డెడికేషన్:**

'ఫౌజీ' షూటింగ్ రోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6:30 వరకు క్రమం తప్పకుండా జరుగుతోందని రవి చెప్పారు. నిన్న తన సీన్లు లేకపోయినా కూడా ప్రభాస్ సెట్స్‌కి వచ్చి మానిటర్ దగ్గర కూర్చుని అవుట్‌పుట్ చూసుకున్నారని వెల్లడించారు.

ఇక సినిమా విషయంలో ప్రభాస్ చూపుతున్న శ్రద్ధ, ఇన్‌వాల్వ్‌మెంట్ వేరే లెవెల్‌లో ఉందని, అవుట్‌పుట్ విషయంలో ఎలాంటి తేడా రాదని భీమవరం వేదికగా హామీ ఇచ్చారు.


**విద్యార్థులకు ప్రభాస్ స్వీట్ మెసేజ్ :**

షూటింగ్ నుంచి భీమవరం ఈవెంట్‌కి వస్తున్నట్లు ప్రభాస్‌కు చెప్పగా, ఆయన ఎంతో ఆనందంగా నవ్వుతూ రియాక్ట్ అయ్యారట. ఎస్ఆర్‌కేఆర్ కాలేజీలో ఈవెంట్ అని తెలపగానే, కాలేజీ విద్యార్థులందరినీ "బాగా చదువుకోమని చెప్పండి" అంటూ ప్రభాస్ ఒక స్వీట్ మెసేజ్ ఇచ్చారని రవి పంచుకున్నారు. అలాగే రవితేజ 'ఇరుముడి' చిత్రబృందానికి కూడా ప్రభాస్ ప్రత్యేకంగా ఆల్ ది బెస్ట్ చెప్పారని తెలిపారు.

**డిసెంబర్ 3న విడుదల ప్లాన్:**

హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ పిరియాడికల్ యాక్షన్ డ్రామాను ఈ ఏడాది డిసెంబర్ 3న విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇక మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్ ప్రభాస్ కెరీర్‌లోనే ప్రత్యేకంగా నిలవనుందని ఇండస్ట్రీ టాక్. ఈ సినిమా కోసం ప్రభాస్ చూపుతున్న డెడికేషన్ చూస్తుంటే బాక్సాఫీస్ వద్ద మరో సంచలనం ఖాయమని స్పష్టమవుతోంది. ఒకవైపు ఆగస్టు 21న రాబోతున్న రవితేజ 'ఇరుముడి' సినిమాపై హైప్ క్రియేట్ చేస్తూనే, మరోవైపు ప్రభాస్ 'ఫౌజీ'పై మైత్రి రవి ఇచ్చిన ఈ పవర్ ఫుల్ అప్‌డేట్ ఫ్యాన్స్‌కు డబుల్ ధమాకా ఇచ్చింది. ఇక ప్రభాస్ డెడికేషన్‌తో రూపుదిద్దుకుంటున్న 'ఫౌజీ' వెండితెరపై ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలని అభిమానులు ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు.

# బాలీవుడ్ నుంచి సౌత్ వరకు... జాన్వీ మాస్టర్ ప్లాన్ ఇదేనా?



కేవలం ఒక హీరోయిన్ భాషలు మారుస్తున్న జర్నీలా కనిపించదు. ఆమె సెలెక్షన్స్ చూస్తే, సౌత్ ఇండియన్ మార్కెట్‌ను లాంగ్ టైమ్‌లో టార్గెట్ పెట్టుకున్న స్ట్రాటజీ కనిపిస్తుందనే అభిప్రాయం సినీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. తెలుగు సినిమాలతో ప్రారంభమైన ఆమె సౌత్ జర్నీ, ఇప్పుడు తమిళ కంటెంట్ వైపు మళ్లుతున్నట్లు డిస్కషన్ జరుగుతోంది. ఇందులో ముఖ్యంగా ఓటీటీకు ప్రాధాన్యం ఇవ్వడం మరింత ఆసక్తికర అంశంగా మారింది. తెలుగు సినిమాల్లో స్టార్ హీరోల సరసన కనిపించిన జాన్వీ, సౌత్ ఆడియన్స్‌కు తన పరిచయాన్ని వేగంగా విస్తరించుకుంది. కమర్షియల్ సినిమాల ద్వారా మాస్ రీచ్ సాధించిన తర్వాత, ఇప్పుడు తమిళంలో లేడీ ఓరియెంటెడ్ కథతో ఓటీటీ ప్రాజెక్ట్ వైపు అడుగులు వేస్తోందన్న ప్రచారం యాదృచ్ఛికంగా చూడలేమనే అభిప్రాయం వినిపిస్తోంది. ఒకవైపు పెద్ద సినిమాలు, మరోవైపు కంటెంట్ డ్రివెన్ పాత్రలు అనే రెండు ట్రాక్‌లపై కెరీర్‌ను నిర్మించుకునే ప్రయత్నంగా దీనిని విశ్లేషిస్తున్నారు. తమిళ ఓటీటీలో గత కొంతకాలంగా లేడీ ఓరియెంటెడ్ స్టోరీలకు మంచి ఆదరణ పెరుగుతోంది. గ్రామీణ నేపథ్యాలు, సామాజిక అంశాలు, అణగారిన వర్గాల జీవితాల చుట్టూ తిరిగే కథలు ఆడియన్స్‌లో డిస్కషన్‌కు దారి తీస్తున్నాయి. అలాంటి వాతావరణంలో స్టార్ హీరోయిన్ ఒక విస్తరణ మాత్రమే కాకుండా నటిగా తన పరిధిని పెంచుకునే ప్రయత్నంగా కూడా కనిపిస్తోంది. మరో ఇంట్రెస్టింగ్ అంశం తమిళ వెబ్ సిరీస్‌లలో పెరుగుతున్న స్టార్ పవర్. ఒకప్పుడు వెబ్ సిరీస్‌లు కొత్త నటులకు అవకాశాల వేదికగా ఉండేవి. ఇప్పుడు పరిస్థితి మారింది. సినిమా స్టార్‌లు కూడా ఓటీటీ ప్రాజెక్ట్‌లను సమాన ప్రాధాన్యంతో చూస్తున్నారు. కారణం పాత్రల బలం, కథలకు లభించే స్వేచ్ఛ, మరియు పాన్ ఇండియా డిజిటల్ ఆడియన్స్. ఈ మార్పు తమిళ కంటెంట్‌కు కొత్త స్థాయిని తీసుకొస్తోంది. ఇది జాన్వీ ఒక్కరి కథ కాదు. కియారా అద్వానీ, దీపికా పదుకొణె, తాప్సీ వంటి హీరోయిన్లు కూడా సౌత్ ప్రాజెక్టులపై ఆసక్తి చూపించడం ఈ ట్రెండ్‌కు సంకేతం. సౌత్ ఇప్పుడు బాలీవుడ్ హీరోయిన్లకు సెకండ్ మార్కెట్ కాదు, మెయిన్ మార్కెట్ గా మారుతున్న సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. తెలుగు తర్వాత తమిళం, కమర్షియల్ సినిమా తర్వాత కంటెంట్ ఓరియెంటెడ్ ఓటీటీ, మాస్ రీచ్ తర్వాత యాక్టింగ్‌కు ప్రాధాన్యం ఉన్న పాత్రలు.. ఈ క్రమాన్ని చూస్తే జాన్వీ కపూర్ సౌత్ స్ట్రాటజీ ఒక లాంగ్ టర్మ్ ప్లాన్‌లా కనిపిస్తోంది. బాలీవుడ్‌లో కంటిన్యూ అవుతూనే సౌత్‌లో బలమైన స్థానం సంపాదించుకోవడం ఆమె అసలు లక్ష్యమా అనే ప్రశ్న ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# కోలీవుడ్‌లో ఇదో కొత్త స్ట్రాటజీనా?



కోలీవుడ్‌లో సినిమా ప్రమోషన్ విధానం గణనీయంగా మారుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఒకప్పుడు సినిమా మొదలైన రోజు నుంచి ప్రతి షెడ్యూల్‌కు సంబంధించిన ఫొటోలు, వీడియోలు, లొకేషన్ అప్‌డేట్లు బయటకు వచ్చేవి. ఇప్పుడు మాత్రం కొంతమంది డైరెక్టర్లు పూర్తిగా భిన్నమైన వ్యూహాన్ని అనుసరిస్తున్నారు. షూటింగ్ పూర్తయ్యే వరకు ప్రాజెక్ట్‌ను గోప్యంగా ఉంచడం, చివరి దశలో ఫస్ట్ లుక్‌తో ఒక్కసారిగా అనౌన్స్ చేయడమనే ధోరణి పెరుగుతోంది. తాజాగా విజయ్ సేతుపతి– బాలాజీ తారణీతరన్ కాంబినేషన్‌లో వస్తున్న బత్తా చుట్టూ ఏర్పడిన డిస్కషన్ ఈ మార్పును స్పష్టంగా చూపిస్తోంది. ఇండస్ట్రీ వర్గాల అభిప్రాయం ప్రకారం ఈ సైలెంట్ ప్రొడక్షన్ మోడల్‌కు మెయిన్ రీజన్ లీక్ కల్చర్. సోషల్ మీడియా, ఫ్యాన్ పేజీలు, యూట్యూబ్ ఛానెళ్ల వేగం పెరగడంతో సినిమా షూటింగ్‌కు సంబంధించిన సమాచారం నిమిషాల్లో వైరల్ అవుతోంది. దీంతో కథ, పాత్రలు, లుక్స్, కీలక సన్నివేశాలు ముందుగానే బయటకు వచ్చే ప్రమాదం ఉంది. అందుకే కొన్ని టీమ్స్ షూటింగ్‌ను చాలా లిమిటెడ్ ఇన్ఫర్మేషన్ తో నిర్వహిస్తూ, అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చే వరకు ప్రాజెక్ట్‌ను సీక్రెట్‌గా ఉంచుతున్నాయి. ఇందులో మరో ఇంట్రెస్టింగ్ అంశం సర్‌ప్రైజ్ మార్కెటింగ్. నెలల తరబడి చిన్నచిన్న అప్‌డేట్లు ఇవ్వడం కంటే, ఒక్క ఫస్ట్ లుక్ పోస్టర్‌తోనే భారీ డిస్కషన్‌ను క్రియేట్ చేయడం ఇప్పుడు మరింత ఇంపాక్ట్‌ఫుల్ స్ట్రాటజీగా మారుతోంది. ప్రేక్షకులకు కొత్తదనం అనిపించడం, సోషల్ మీడియాలో ఆర్గానిక్‌గా ట్రెండ్ కావడం, మీడియా దృష్టి ఒక్కసారిగా ప్రాజెక్ట్‌పై కేంద్రీకరించడం ఈ మోడల్‌కు ఉన్న ప్రధాన ప్రయోజనాలుగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో డైరెక్టర్– హీరో కాంబినేషన్లు కూడా బ్రాండ్‌లుగా మారుతున్నాయనే డిస్కషన్ బలపడుతోంది. తమిళ సినిమాల్లో మణిరత్నం– కమల్ హాసన్, వెట్రిమారన్– ధనుష్ వంటి కాంబినేషన్లకు ప్రత్యేకమైన గుర్తింపు ఉన్నట్లే, బాలాజీ తారణీతరన్– విజయ్ సేతుపతి జోడీ కూడా అలాంటి నమ్మకాన్ని సంపాదించిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వీరిద్దరూ కలిసి చేసిన నడువుల కొంజం పక్కత కానోమ్, సీతాకాథి సినిమాలు కమర్షియల్ సక్సెస్‌తో పాటు విమర్శకుల ప్రశంసలు కూడా అందుకున్నాయి. అందుకే ఈ కాంబినేషన్‌లో కొత్త సినిమా వస్తుందనే వార్తే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఓటీటీ యుగంలో కంటెంట్‌కు ఉన్న వాల్యూ పెరగడం, ప్రమోషన్ ఖర్చులను సమర్థవంతంగా వినియోగించాల్సిన అవసరం, సోషల్ మీడియా ప్రభావం వంటి అంశాలు కలిపి కోలీవుడ్‌లో కొత్త మార్కెటింగ్ సంస్కృతికి దారి తీస్తున్నాయి. ముందుగానే ప్రతి విషయాన్ని వెల్లడించే కాలం నుంచి, చివరి వరకు సీక్రెట్‌గా ఉంచి ఒక్కసారిగా ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చే వ్యూహం వైపు కోలీవుడ్ ఇండస్ట్రీ వేగంగా అడుగులు వేస్తోందని చెప్పవచ్చు.

# మంచి పుస్తకాలు విద్యార్థుల మస్తిష్క వికాస సాధనాలు

## - ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా జాతీయ గ్రంథపాలకుల దినోత్సవం




**విజయనగరం, (రాజధాని వార్తలు):** విద్యార్థుల జీవితాల్లో వెలు గులు నింపేవి మంచి పుస్తకాలేనని, మంచి పుస్తకాలు విద్యార్థుల మస్తిష్క వికాస సాధనాలు అని విజయనగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కందుల రేఖ పేర్కొన్నారు. జాతీయ గ్రంథపాలకుల దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గ్రంధాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖతో కలిసి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ వ్యాయామం ఎలా శారీరక ఆరోగ్యమో, పుస్తకపఠనం మనసుకు వ్యాయామం ఆరోగ్యం అన్నారు. ముందుగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ గ్రంధాలయ సంఘం జిల్లా అధ్యక్షులు సముద్రాల గురు ప్రసాద్, కార్యదర్శి సుభద్రాదేవితో కలిసి ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుస్తక పఠనంతో పరిపూర్ణ వ్యక్తిత్వం లభిస్తుందని అన్నారు. గురు ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు తమ విలువైన కాలాన్ని గ్రంథాలయాల వద్ద కలపాలని మంచి పుస్తకాలు ఉన్నత లక్ష్యాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని, గ్రంథాలయాలు విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి ఆర్ వాణి, ఐ క్యు ఏసి కోఆర్డినేటర్ డాక్టర్ జి వి ఎస్ జయపాల్, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం రామ గీతాదేవి తదితరులు మాట్లాడుతూ శిక్షణా క్రమశిక్షణతో పాటు విద్యార్థులకు పుస్తకాలు ఎంతగా దోహద పడతాయో, విద్యార్థులు గ్రంథాలయాలను ఉపయోగించుకోవలసిన ఆవశ్యకత ఏమిటో చక్కగా వివరించారు. కార్యక్రమంలో భాగంగా సంఘం కార్యదర్శి సుభద్ర దేవిని కళాశాల ప్రిన్సిపల్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి కోఆర్డినేటర్గా వ్యవహరించిన డాక్టర్ జి ప్రభాకర్ తమ కళాశాలలో విద్యార్థుల కోసం గ్రంథాలయంలో పుస్తకాలు అందుబాటులో ఉంచడమే కాక, డిజిటల్ సదుపాయాలను కూడా విద్యార్థులకు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

# సీ.ఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

## - మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కి కృతజ్ఞతలు తెలియజేసిన మండల నాయకులు - చెక్కు అందజేసిన చప్పా చంద్రశేఖర్ శిరివూరి నారాయణ మూర్తి రాజు, నాయకులు



**(దత్తిరాజేరు), గజపతినగరం, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ఎం.ఎస్.ఎం.ఇ , సర్ఫ్, ఎన్.ఆర్.ఐ వ్యవహారాల శాఖామాత్యులు కొండపల్లి శ్రీనివాస్ చొరవతో మండలంలోని చినకాద గ్రామంలో బుధవారం సీ.ఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందచేసినట్లు మండల నాయకులు విలేకరులకు తెలియజేశారు. చినకాద గ్రామంలో ఐదు నెలల క్రితం ఇనపకుర్తి పాపమ్మ(56) భర్త ఇనపకుర్తి పోలయ్య బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి మరణించిన విషయాన్ని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దృష్టిలో పెట్టడం జరిగిందని మండల నాయకులు, గ్రామ నాయకులు తెలియజేశారు. విషయం తెలుసుకున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తక్షణమే స్పందించి చనిపోయిన ఇనపకుర్తి పాపమ్మకు సీ.ఎం రిలీఫ్ ఫండ్ నుంచి 1,46, 004/- రూపాయలు చెక్కును మంజూరు చేయించారు. ఈ చెక్కును ఇనపకుర్తి పాపమ్మ భర్త ఇనపకుర్తి పోలయ్యకి బుధవారం అతని ఇంటి వద్దనే టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, మండల ఆర్గనైజింగ్ సెక్రెటరీ శిరువూరి నారాయణమూర్తి రాజు, క్లస్టర్ ఇంచార్జ్ మిత్తిరెడ్డి ఈశ్వరరావు, మండల నాయకులు బోడసింగి సత్యంనాయుడు, మిత్తిరెడ్డి రామ, బండి కృష్ణ తదితరులు అందజేసినారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చొరవతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి వచ్చిన చెక్కు తమ కుటుంబానికి ఆర్థికంగా ఎంతగానో సహాయపడుతుందని ఇనపకుర్తి పోలయ్య అన్నారు. తన కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి చెక్కు రావడానికి కృషి చేసిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కి, మండల, గ్రామ నాయకులకు ఇనపకుర్తి పోలయ్య కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి



**విజయనగరం, (రాజధాని వార్తలు):** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి బుధవారం సాయంత్రం సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ మ్యాపింగ్ కాని ఓటర్లను మ్యాపింగ్ చేయడంతో పాటు, ఇప్పటికే మ్యాపింగ్ పూర్తయిన వాటిలో గుర్తించిన తప్పులు, పొరపాట్లను నిబంధనల మేరకు సరిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా అభ్యంతరాలు, క్లెయిమ్‌లకు సంబంధించి హియరింగ్ నోటీసులు సకాలంలో జారీ చేసి, విచారణ నిర్వహించి, నిబంధనల ప్రకారం పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, అర్హత కలిగిన వాటిని నిబంధనల మేరకు పరిష్కరించాలని సూచించారు. అదేవిధంగా ఓటర్ల క్లెయిమ్‌లు, అభ్యంతరాలు, బదిలీలకు సంబంధించిన ఫారం-6, ఫారం-6 ఏ, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఎస్ ఐఆర్ ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా, ఎన్నికల నిబంధనలు మరియు మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, పెండింగ్ అంశాలను గుర్తించి వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# చెని సుజాత మృతదేహానికి నివాళులర్పించిన వైసీపీ సమన్వయకర్త గురవయ్య



**గూడూరు, (రాజధాని వార్తలు):** గూడూరు పట్టణంలోని మూడవ వార్డు వార్డు వైసీపీ ఇంచార్జ్ చెని విజయ్ సతీమణి చెని సుజాత మృతి చెందారు. విషయం తెలుసుకున్న గూడూరు నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ బూదూరు గురవయ్య వైసిపి నాయకులతో కలిసి ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం చెని విజయ్‌ని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు దేవళ్ళ శ్రీధర్ రెడ్డి, ముప్పాళ్ళ చంద్రమోహన్ రెడ్డి, అట్ల శ్రీనివాసులు రెడ్డి, మనుబోలు కృష్ణయ్య తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# జిసిసి ప్రభుత్వ భూమిని కాపాడాలి

## - జిసిసి అధికారుల అసమర్థత వల్లనే భూమిని కాపాడుకోలేకపోతున్నారు - ఐటీడీఏ పీఓకి వినతిపత్రం - 107 యాక్ట్ ఏజెన్సీ ఏరియాలో ప్రభుత్వ భూమికి సంబంధించిన స్టే వర్తిస్తుందా? - థర్డ్ పార్టీకి స్టే వస్తే ఇప్పటివరకు ఏముందో ఎందుకు ఎంఆర్ఓ చెప్పడం లేదు - పి డి ఎస్ యు మునిగేలా శివ ప్రశాంత్




**భద్రాచలం, (రాజధాని వార్తలు):** భద్రాచలం పట్టణంలో గిరిజన మార్ట్ పక్కన ఖాళీగా ఉన్న భూమిని కొంతమంది వ్యక్తులు భూమి మాది అని అక్రమంగా నిర్మాణం చేస్తున్నారని ఆయన అన్నారు. గిరిజన సొసైటీ భద్రాచలం ప్రాంతంలో సుదీర్ఘకాలంగా గిరిజనులకు, గిరిజనుల అభివృద్ధికి తోడ్పడుతూ ఉందని 1965లో భద్రాచలం పట్టణంలో స్థాపించారని అప్పుడు నాలుగు ఎకరాల 50 సెంట్ల భూమిని కేటాయించారని, కాలక్రమంలో ఆ భూమి రెండు ఎకరాల 83 సెంట్లుగా ఉందని 2009లో ఐటీడీఏ పీవో భద్రాచలం తాసిల్దార్ భవాని ఆ భూమిని గుర్తించారని ఆయన గుర్తు చేశారు. అనేక సందర్భాల్లో ఈ సమస్య జిట్టలమై వస్తుందని ఈ సమస్య పరిష్కారం కాకుండా కొంతమంది ప్రజాప్రతినిధులు అడ్డుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ప్రభుత్వ శాఖకు సంబంధించిన భూమిని కొంతమంది ఆక్రమాదారులు ఆక్రమిస్తే వారికి కొమ్ముగాస్తున్నారని ఆ విషయంలో ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధులు కొంతమంది దొడ్డి చాటున సహకరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రెండు ఎకరాల 83 సెంట్లు భూమిని సర్వే చేసినప్పటికీ అక్రమంగా నిర్మాణం చేసిన బిల్డింగ్‌ని తొలగించి జి సి సి అధికారులకు అప్పజెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈరోజు ఐటీడీఏ పీఓకే వినతి పత్రం అందజేయగా పిఓ త్వరితగతిన సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు అని ఆయన అన్నారు. తొందరలోనే అక్రమంగా కబ్జా చేసిన భూమిని స్వాధీనపరుచుకుంటామని పిఓ అన్నారు. దీనికి సంబంధించిన ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా డాక్టర్ ముర్ము, రాష్ట్ర ట్రైబల్ మంత్రివర్యులకు, రెవిన్యూ శాఖ మంత్రి వర్యులు పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డికి, జిల్లా కలెక్టర్‌కి, జిసిసి జిల్లా అధికారికి మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశామని ఆయన అన్నారు. ప్రభుత్వ శాఖకు సంబంధించిన భూమిని కబ్జా చేసిన వారిపై కేసును నమోదు చేసి ప్రభుత్వ సమస్త భూమిని కాపాడాలని ఆయన అన్నారు. దీనికి సంబంధించిన పూర్తి డాక్యుమెంట్ ప్రభుత్వ అధికారులను అడుగుతున్నారు తప్ప కబ్జా చేసిన వారిని ఎందుకు అడగడం లేదని ఆయన ప్రశ్నించారు. ఐ టి డి ఎ.పి ఓ ఫీల్డ్ మీదకు వచ్చి తగు విచారణ చేసి భూమిని సంబంధిత శాఖకు అప్పజెప్పాలని పి డి ఎస్ యు మునిగేలా శివ ప్రశాంత్ డిమాండ్ చేశారు.

# గుండెపోటు లోడింగ్ డోస్ టాబ్లెట్ కిట్ పంపిణీ






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నందు వాకర్స్ ఇంటర్నేషనల్ 203 డిస్టిక్ గవర్నర్ నలుబోలు బలరామయ్య నాయుడు ఆధ్వర్యంలో శుభమస్తు షాపింగ్ మాల్ అధినేత భయ్యా శ్రీనివాసులు సౌజన్యంతో గుండెపోటు ప్రాథమిక చికిత్స లోడింగ్ డోస్ కిట్ 1000 మందికి పంచడం జరిగింది.

ఈ కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్ గుండె డాక్టర్ సి ఎస్ శ్రీనివాస రాజు పాల్గొని ఈ లోడింగ్ డోస్ వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరంగా తెలియజేశారు వాకర్స్ యొక్క అనుమానాలను నివృత్తి చేసి శుభమస్తు షాపింగ్ మాల్ వారు చేస్తున్న సేవలను కొనియాడారు. మాజీ వాకర్స్ ఇంటర్నే షనల్ ప్రెసిడెంట్ నేతాజీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ యొక్క కిట్ మీకే కాకుండా మరియు మీ బంధువులకు స్నేహితులకు అందరికీ పంచమని కోరడమైనది వాకర్స్ ఇంట ర్నేషనల్ ఆధ్వర్యంలో ఈ పంపిణీ కార్యక్రమం జరగడం చాలా ఆనందంగా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏకొల్లు రాఘవరెడ్డి, దాసరి అనంతరామారావు, పొన్నం రవిచంద్ర, షేక్ నశీర్ అహ్మద్, జే వసుంధర దేవి, ఎస్డీ ఖుద్దీన్, స్నేహ సురేష్, మల్లెం కొండారెడ్డి, వీరిశెట్టి హజరత్ బాబు, ఎన్ బుజ్జి రెడ్డి, వేలూరు రంగారావు, తిరుపతి శేఖర్, ఎం భారతి, జి వి కృష్ణయ్య, పత్తిపాటి రమణయ్య, ఆరి ప్రసాద్, నైజాం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల హరిత కార్యక్రమం




**రేణిగుంట, (రాజధాని వార్తలు):** రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా రేణిగుంట మండల పరిధిలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో వెయ్యి మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా బుధవారం రేణిగుంట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ జయచంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో వివిధ రకాల మొక్కలను నాటి వాటికి నీరు పోశారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు భావితరాలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలంటే పెద్దఎత్తున మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో, నాటిన మొక్కలను సంరక్షించడం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి తన ఇంటి పరిసరాల్లో కనీసం ఒక మొక్కను నాటి, దాని సంరక్షణ బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. పచ్చదనం పెరిగితే స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన జీవన వాతావరణం సాధ్యమవుతుందని తెలిపారు. రేణిగుంట మండలంలోని వివిధ ప్రాంతాల్లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో హరిత కార్యక్రమాలను కొనసాగించనున్నట్లు అధికారులు తెలిపారు. నాటిన మొక్కల సంరక్షణపై కూడా ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ జయ చంద్ర, ఎస్సై శ్రీనివాసులు, రైటర్ చలపతి, పాఠశాల హెచ్ఎం శ్యామల, ఎంఈఓ రంగనాథం, డీవైఈఓ ఇందిరాదేవి, పోలీసు సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి

## - దైనందిన జీవితంలో క్రీడలు మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం, ప్రశాంతతను పెంపొందిస్తాయి
## - అమరావతి ఛాంపియన్షిప్-2026 క్రీడా పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే ఆనందరావు, కలెక్టర్ మహేష్ కుమార్






**అమలాపురం, (రాజధాని వార్తలు):** దైనందిన జీవితంలో క్రీడలు మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం, ప్రశాంతతను పెంపొందిస్తాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆర్.మహేష్ కుమార్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం జిఎంసి బాలయోగి స్టేడియంలో బుధవారం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావుతో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని యువ క్రీడాకారులలో ఉన్న ప్రతిభను గుర్తించి వారికి రాష్ట్రస్థాయిలలో తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం కల్పించే ఉద్దేశంతో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ విజయవాడ ఆధ్వర్యంలో అమరావతి ఛాంపియన్షిప్-2026 క్రీడా పోటీలను ప్రారంభించారు. మీ క్రమశిక్షణ, కష్టపడి పనిచేసేతత్వం, పట్టుదల క్రీడా స్ఫూర్తి మన జిల్లాకు గొప్ప బలమని మనమందరం కలిసి అమరావతి ఛాంపియన్షిప్ - 2026ను విజయవంతం చేసే దిశగా కృషి చేయాలని క్రీడాకారులను కలెక్టర్ కోరారు. ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ యువ క్రీడాకారులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు రాష్ట్ర స్థాయిలో మంచి పేరు తీసుకు రావాలని ఆయన కోరారు. క్రీడాకారులు ఐక్యమత్యంతో క్రీడా స్ఫూర్తి కనబరిచి విజయాలు సాధించాలని కోరారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రాజోలు, రామచంద్రపురం, అమలాపురం, మమ్మిడివరం, కొత్తపేట, పి.గన్నవరం నియోజకవర్గాలలో యువ క్రీడాకారుల ప్రతిభను గుర్తించే దిశగా నియోజకవర్గ సెలక్షన్ ట్రయల్స్ జులై 21 నుండి జూలై 31 వరకు అండర్- 17, అండర్-23 బాలురు, బాలికలు పోటీలు విజయ వంతంగా నిర్వహించామని కలెక్టర్ తెలిపారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన యువ క్రీడాకారులు జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయి ఛాంపియన్షిప్-2026న పాల్గొనే అవకాశం వస్తుందని కలెక్టర్ తెలిపారు. రాష్ట్రస్థాయి ఛాంపియన్షిప్ -2026 తిరుపతిలో ఆడేందుకు ఏపీఎస్ఆర్టీసీ వారి సహకారంతో క్రీడాకారులకు బస్ సౌకర్యం సద్వినియోగం చేసు కోవాలన్నారు. రాష్ట్ర స్థాయి విజేతలను ప్రోత్సహిం చేందుకు 91,90000 ప్రైజ్ మనీ సొంతం చేసుకునే విధంగా క్రీడాకారులు మరింత ఉత్సాహాన్ని ప్రేరణను పెంపొందించుకోవాలని కలెక్టర్ కోరారు. రాష్ట్ర స్థాయి ఛాంపియన్ షిప్ సెలెక్ట్ అయిన యువ క్రీడాకారులను సకాలంలో హాజరయ్యేలా కోచ్‌లు, మేనేజర్లు, పీఈటీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అముడ చైర్మన్ స్వామి నాయుడు డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ అధికారి వి ఆర్.రుద్ర, స్కూల్ గేమ్ సెక్రటరీలు కే ఈశ్వర్, ఏ ఎస్ ఎస్ రమాదేవి, ఎస్జీఎఫ్‌లు, జిల్లా పిఈటిలు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమ ప్రభుత్వం కూటమి ప్రభుత్వం

## - టిడిపి రాష్ట్ర కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి



**గూడూరు, (రాజధాని వార్తలు):** ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తూ ప్రజల సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కోటమే ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర టిడిపి కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రెండు ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమంలో భాగంగా ఇంటింటి టిడిపి కార్యక్రమం చెన్నూరు గ్రామంలోని తూర్పు వీధి నందు టిడిపి రాష్ట్ర పార్టీ కార్యదర్శి కందుకూరు నియోజకవర్గ పరిశీలకులు మట్టం శ్రావణి రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గూడూరు నియోజకవర్గం పరిశీలకురాలు లక్ష్మీ ప్రసన్న పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ 2 సంవత్సరాలలో చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని గురించి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో భాగంగా సూపర్ సిక్స్‌లో హామీలు ఇచ్చిన విధంగా చెప్పింది చెప్పి నట్లు మహిళలకి ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వడం కానీ, స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, చదువుకునే ప్రతిబిడ్డకి 13,000 రూపాయలు తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి తల్లి ఖాతాలో జమ చేయడం జరిగింది,రైతులకు 2వ సంవత్సరం తొలివిడత అన్నదాత సుఖీభవ జమ చేయడం, అదేవిధంగా చేనేతలకి చేనేత మగ్గాలకు 200 యూనిట్లు,మర మగ్గాలకు 500 యూనిట్లు ఇవ్వడమే కాకుండా, ప్రతి నేతన్నలు నేతన్న నేస్తం పథకం ద్వారా 25,000 జమ చేయడం జరిగింది. అర్హులైన నిరుపేదలకు ఎన్టీఆర్ గృహాలు, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు నెల నెలా 4,000 నుండి 15,000 వరకు అందించడమే కాకుండా, మెగా డీఎస్సీ ద్వారా తొలి సంవత్సరంలోనే 16,375 మందికి ఉపాధ్యాయ ఉద్యోగ అవకాశాలు కల్పించి ఆ కుటుంబాలకు భరోసా కల్పించారు. అలాగే చెప్పని హామీలు కూడా దివ్యాంగ శక్తి పథకం ద్వారా వికలాంగులకు ఉచిత బస్సు సౌకర్యం,ఆటో డ్రైవర్లుకి ఆటో డ్రైవర్ల సేవలో పథకం ద్వారా 15,000 రూపాయలు ఇవ్వడం జరిగింది. ఇంతేకాకుండా సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు, అంగన్వాడీ కేంద్రాలు, హాస్పిటల్‌లు, సీఎంఆర్ఎఫ్, ఎల్ఓసి ద్వారా ఎంతో మంది అనారోగ్యాలకు ఉచిత వైద్య సేవలు అందించి, యువతకు ఉపాధి అవకాశం కల్పించాలని ఎన్నో కొత్త కంపెనీలు రాష్ట్రానికి తీసుకొని వచ్చి స్కిల్ డెవలప్మెంట్ ద్వారా ఎంతో మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని, ఈ బాటలోనే మన శాసన సభ్యులు డాక్టర్ పాశిశీ సునీల్ కుమార్ పేదల సేవలోనే ఉంటూ ఎన్నో అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాలు చేస్తున్నారని, కాబట్టి ప్రతిఒక్కరు ఈ విషయాలు దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వాన్ని ఆదరించాలని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మట్టం మురళి, ఇందుకూరు శ్రీకాంత్ రెడ్డి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫోటోగ్రాఫర్స్ & వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



**అల్లవరం, (రాజధాని వార్తలు):** అల్లవరం మండల ఫోటోగ్రాఫర్స్ & వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం నక్కరామేశ్వరంలో ఘనంగా జరిగింది. జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ అడ్డాల రఘు ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి డా. బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఫోటోగ్రాఫర్స్ & వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గెడ్డం సురేష్, సాయి మణికంఠ కలర్ ల్యాబ్ అధినేత ధనరాజు, అమలాపురం యూనియన్ మాజీ అధ్య క్షులు నగేష్, అల్లవరం మండల మాజీ అధ్యక్షులు సిహెచ్. నాయకర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అల్లవరం మండల అధ్యక్షులుగా చింతా కరుణాకర్, వైస్ ప్రెసిడెంట్‌గా కుడుపూడి సామ్రాట్, సెక్రటరీగా కర్రీ రమేష్, ట్రెజరర్‌గా ఎం.వి.వి.ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా అధ్యక్షులు గెడ్డం సురేష్ మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్స్ యూనియన్ మరింత పటిష్టంగా, ఐక్యతతో ముందుకు సాగాలని ఆధునిక టెక్నాలజీకి అనుగుణంగా ప్రతి ఒక్కరూ తమ వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకుని ఫోటోగ్రఫీ రంగంలో ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. నూతన కార్యవర్గ సభ్యులకు ముఖ్య అతిథులు శుభాకాంక్షలు తెలిపారు.

# ఆకస్మిక తనిఖీలు చేపట్టిన రామచంద్ర మోహన్



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తి దేవస్థానంలో దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ బుధవారం ఆకస్మిక తనికీలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాలు, భద్రత, పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు. దేవాదాయ ధర్మాదాయ కమిషనర్ శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానాన్ని కె. రామచంద్ర మోహన్ భక్తుల సౌకర్యార్థం చేబడుతున్న వివిధ అభివృద్ధి పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. దేవస్థానంలో కొన సాగుతున్న మౌళిక వసతుల అభివృద్ధి, భక్తుల సౌకర్యాల విస్తరణ, దర్శన సదుపాయాలు, రద్దీ నిర్వహణ అంశాలపై సమీక్ష నిర్వహించారు. స్టోర్స్‌లో వివిధ రసవర్గాల నాణ్యతను పరిశీలించి శాంపిల్స్ తీసుకు న్నారు. పారిశుద్ధ్యం, టాయిలెట్ల నిర్వహణను కూడా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు శానిటేషన్ సిబ్బంది సంఖ్యను పెంచాలని, భక్తులకు అందిస్తున్న తాగునీటి సదుపాయంలో ప్లాస్టిక్ క్యాన్లకు బదులుగా స్టెయిన్‌లెస్ స్టీల్ (స్టీల్) క్యాన్లను వినియోగించాలని సూచించారు. అలాగే ఆలయంలో చేపట్టే పెయింటింగ్ పనులు ఆలయ సంప్రదాయ, ఆధ్యాత్మిక శైలికి అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, నిత్య అన్నదానంలో భక్తులకు రుచికరమైన అన్న ప్రసాదం వడ్డించాలని సూచించారు. గంగా సదన్ సత్రములో వసతి గదుల పరిస్థితిని పరిశీలించారు. అలాగే క్యూ లైన్లలో, రాహుకేతు పూజ మండపములోని భక్తులతో స్వయముగా మాట్లాడి భక్తులకు అందించే అన్ని సదుపాయాలు సక్రమముగా ఉన్నాయో లేదో అని విచారించి తగు సూచనలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో బీకే వెంకటేశులు, ట్రస్ట్ బోర్డు చైర్మన్ కె.సాయిప్రసాద్, బోర్డు సభ్యులు గురప్పశెట్టి, లక్ష్మమ్మ, ఈఈ శ్రీనివాస రాజు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అన్న క్యాంటీన్లో 350 మందికి ఉచితంగా భోజనాలు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తన యుడు, తెదేపా జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్ జన్మదిన వేడుకలను సామర్లకోట అన్న క్యాంటీన్లో పేద ప్రజల మధ్య కోలాహలంగా నిర్వహించారు. బుధవారం సామర్లకోట అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే చినరాజప్ప సందర్శించి ఆహార పదార్థాల నాణ్యత పరిశీలించారు. తన కుమారుడు రంగనాగ్ జన్మదిన వేడుకలు తెదేపా నాయకులు అభిమానులు మధ్య ఘనంగా నిర్వహించి, కేక్ కటింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సుమారు 350 మంది పేద ప్రజలకు ఉచితంగా అన్నా క్యాంటీన్ ద్వారా ఆహార పదార్థాలను ఉచి తంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, కంటే జగదీష్ మోహన్, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, తాతపూడి కృష్ణబాబు, బలుసు వాసు, బొందల రామలక్ష్మి, గుడాల శంకర్, మున్సిపల్ కమిషనర్ ఎన్ కనకారావు, నాయకులు పాల్గొన్నారు.

# ఉరుసు ఉత్సవాల్లో జనసేన పార్టీ యువ నాయకులు మిధున్ శాలీ



**రేణిగుంట, (రాజధాని వార్తలు):** మామండూరు గ్రామంలో నిర్వహించిన ఉరుసు ఉత్సవాల్లో జనసేన పార్టీ యువ నాయకులు మిధున్ శాలీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత పెద్దలు, ఉరుసు కమిటీ సభ్యులతో కలిసి గ్రామ అభివృద్ధి, ఉరుసు ప్రాముఖ్యతపై చర్చించారు. మామండూరు గ్రామంలో రోడ్లు, తాగునీరు, విద్య, వైద్య సౌకర్యాలను మెరుగుపరిచేందుకు తన వంతు కృషి చేస్తామని మిధున్ శాలీ హామీ ఇచ్చారు. ఉరుసు కేవలం ఒక వేడుక మాత్రమే కాదని, సర్వమత సామరస్యం, ప్రేమ, మానవత్వానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. అనంతరం మిధున్ శాలీ దర్గాను దర్శించి పూలమాలలు సమర్పించి ప్రత్యేక దుఆ చేశారు. భక్తులతో కలిసి లంగర్‌లో పాల్గొన్నారు. అన్ని మతాలను గౌరవిస్తూ, "అభివృద్ధి అందరికీ" అనే లక్ష్యంతో జనసేన పార్టీ ముందుకు సాగుతుందని తెలిపారు.

# ఎంవీ రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం



**కోట, (రాజధాని వార్తలు):** మండలం పరిధిలోని వడ్డీ పాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద బుధవారం కోట మండలం, చందోడు గ్రామానికి చెందిన విద్యా ప్రదాత స్వర్గీయ ముప్ప వరపు వెంకటేశ్వరరావు ఆదిలక్ష్మిల పేరిట ఏర్పాటైన ఎం వి రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఎంవి రావు ఫౌండేషన్ కార్యదర్శి ముప్పవరపు విజయ లక్ష్మి జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో కొండాపురం పంచాయతీ పరిధిలోని గ్రామ స్తులందరూ ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరంలో కోట పట్టణానికి చెందిన రమేష్ ఐ కేర్ కంటి వైద్య నిపుణులు డాక్టర్ వి రమేష్ బాబు నేత్ర సమస్యలతో బాధపడే వారిని అందరిని కంప్యూటర్ ద్వారా కంటి పరీక్షలు నిర్వహించి వారిలో దృష్టి లోపం ఉన్నవారికి అతి తక్కువ ధరకు కంటి అద్దాలు, అదేవిధంగా కంటిలో శుక్లాలు ఉన్నవారికి తిరుపతి వాసన్ ఐ కేర్ నందు ఉచితంగా కంటి ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు ఎం వి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ తెలిపారు. ఈ శిబిరంతో ఎంవి రావు ఫౌండేషన్ ఇప్పటివరకు పదకొండువేళ్ల ఆరువందల డెబ్బై సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు లీలా మోహన్ కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం వీరవ ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలామోహన్ కృష్ణ, కార్యదర్శి ఎం విజయలక్ష్మి, మోహన్ నాయుడు, మాజీ సర్పంచ్ సీనయ్య, ప్రధానో పాధ్యాయిని ఏ శ్రావణ కుమారి, అంగన్వాడి ఉపాధ్యాయులు సాయమ్మ కే రత్నమ్మ గ్రామస్తులు చిన్నారులు పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
# 9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- , అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ వి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎప్లానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్స్ కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పోట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్‌పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# వన్యప్రాణుల సంరక్షణ ప్రజా ఉద్యమంగా మారాలి : పవన్ కల్యాణ్

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఏనుగులు భారతదేశ వన్యప్రాణి వార సత్వానికి ప్రతీకలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. అవి అడవుల సంరక్షణతో పాటు పర్యావరణ సమతుల్యతలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో దేశంలో ఏనుగుల సంరక్షణకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. 'ప్రాజెక్ట్ ఎలిఫెంట్'పై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఉద్ఘాటించారు. ఏనుగుల కారిడార్ల రక్షణ, 'ప్రాజెక్ట్ ఎలిఫెంట్' బలోపేతం, సాంకేతిక పరిజ్ఞానంతో పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టామని వివరించారు. వరల్డ్ ఎలిఫెండ్ డే వేడుకలను విశాఖ పట్నంలో గురువారం నిర్వహించారు. విశాఖలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి కీర్తి వర్ధన్ సింగ్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, అటవీ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడారు.

**ఏపీలో 132 నుంచి 142 అడవి ఏనుగులు..**

ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 132 నుంచి 142 అడవి ఏనుగులు ఉన్నాయని పవన్ కల్యాణ్ వెల్లడించారు. వాటి సంరక్షణ మనకు గర్వకారణమే కాకుండా బాధ్యత కూడా అని తెలిపారు. మనిషి – ఏనుగు ఘర్షణలను తగ్గించేందుకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక అటవీ శాఖల మధ్య సహకారం కొనసాగుతోందని తెలిపారు. కర్ణాటక అటవీ శాఖ సహకారంతో ఆంధ్రప్రదేశ్‌కు నాలుగు కుంకీ ఏనుగులు అందాయని ప్రస్తావించారు. వాటి కోసం ప్రత్యేక శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని వివరించారు. కుంకీ ఏనుగుల సహాయంతో ఇప్పటికే 15 మనిషి – ఏనుగు ఘర్షణ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించామని వెల్లడించారు. దీంతో ఏనుగుల కారణంగా జరిగే మానవ ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించామని చెప్పారు. ఆంధ్రప్ర దేశ్‌లో మనిషి – వన్యప్రాణుల




ఘర్షణల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపారు.

**వన్యప్రాణుల రక్షణ కోసం వంద ప్రత్యేక వాహనాలు..**

వన్యప్రాణుల రక్షణ కోసం వంద ప్రత్యేక వాహనాలను అందుబాటులోకి తీసుకు వచ్చామని పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఇప్పటి వరకు 200కు పైగా వన్యప్రాణులను రక్షించామని చెప్పారు. రైతులకు సకాలంలో హెచ్చరికలు అందించడం, అటవీ సిబ్బందికి ఆధునిక పరికరాలు, శిక్షణ కల్పించడం, వన్యప్రాణులకు సురక్షితమైన ఆవాసాలు కల్పించడం తమ ప్రధాన లక్ష్యాలని వ్యాఖ్యానించారు. వన్యప్రాణుల సంరక్షణ ప్రభుత్వం ఒక్కదాని బాధ్యత కాదని.. ప్రజలను భాగస్వామ్యం చేసి సంరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చాలని సూచించారు. ఏనుగుల సంరక్షణపై దేశవ్యాప్తంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో 21,450 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. వారి ఉత్సాహం, చైతన్యాన్ని అభినందిస్తున్నామని అన్నారు. అభివృద్ధికి బాధ్యత ఉండాలి, సంరక్షణకు లక్ష్యం ఉండాలని తెలిపారు. వన్యప్రాణులను సురక్షితంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# చౌడేశ్వరీ దేవికి ప్రత్యేక పూజలు

**గూడూరు, (రాజధాని వార్తలు):** గూడూరు మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో ఆషాఢ అమావాస్యను పురస్కరించుకుని దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ రామలింగ చౌడేశ్వరీ దేవి జన్మదిన వేడుకలను భక్తిశ్రద్ధల తో నిర్వహించారు. సీత వీధిలోని కోదండ రామస్వామి దేవస్థానంలో అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు.

ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మ వారిని దర్శిం చుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణం లో కేక్ కట్ చేసి భక్తులకు పంపిణీ చేశారు. సాయంత్రం 7 గంటలకు అమ్మవారికి గ్రామ పురవీధుల్లో పల్లకి సేవ నిర్వహిం చనున్నట్లు దేవాంగ సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

# ఏనుగులు, ప్రజల ప్రాణాల రక్షణ.. ప్రభుత్వాల బాధ్యత : కేంద్ర మంత్రి కీర్తి వర్ధన్ సింగ్

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఏనుగుల సంరక్షణతో పాటు ప్రజల ప్రాణాలు, జీవనోపాధి రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్ర పర్యావరణ సహాయక శాఖ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ తెలిపారు. విశాఖలో జరిగిన ప్రపంచ ఏనుగుల దినోత్సవం-2026 ప్రారంభో త్సవ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పాల్గొని ప్రసంగించారు. మానవ-ఏనుగు మధ్య ఘర్షణలు తీవ్రమైన సమస్యగా మారాయ న్నారు. దీనికి తాత్కాలిక చర్యలకంటే శాస్త్రీయ పరిశోధన ఆధారిత సమగ్ర ప్రణాళిక అవసరమని తెలిపారు. ఏనుగుల సంరక్షణలో పురోగతి సాధించినప్పటికీ పంట నష్టం, ప్రాణనష్టం, అలాగే ఏను గుల మృతి వంటి ఘటనలు పెరుగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సమగ్ర ఏనుగు సంరక్షణ ప్రణాళికను రూపొందించిందని కేంద్ర మంత్రి వెల్లడించారు. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని పెంపొందిస్తూ బందీ ఏనుగుల డీఎన్ఏ డేటాబేస్‌తో పాటు ఏనుగుల కదలికలను పర్యవేక్షించే 'గజ సూచన' యాప్‌ను వినియోగిస్తున్నామని తెలిపారు. ఘర్షణలను తగ్గించడంలో ఏనుగుల ప్రవర్తనపై అధ్యయనానికి ఈ యాప్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

**రైల్వే మార్గాల వద్ద చర్యలు**

ఏనుగుల మృతిని నివారించేందుకు రైల్వే శాఖతో సమన్వయంగా ప్రమాదకర ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు, ఫెన్సింగ్, హెచ్చరిక వ్యవ స్థలు ఏర్పాటు చేస్తున్నామని కేంద్ర మంత్రి తెలిపారు. విద్యుత్ లైన్ల కారణంగా జరిగే ప్రమాదాలను తగ్గించేందుకు కూడా అవస రమైన చర్యలు చేపడుతున్నామని అన్నారు. సిక్కిం, తమిళనాడు, ఉత్తరప్రదేశ్‌లో మూడు కొత్త ఏనుగు రిజర్వులు ఏర్పాటు చేస్తున్నా మన్నారు. ఘర్షణలకు ఒకే విధమైన పరిష్కారం ఉండదని, ప్రాంతాల వారీగా కారణాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సూచిం చారు. తాత్కాలిక చర్యలకు పరిమితం కాకుండా ముందస్తు అంచనా ఆధారిత వ్యవస్థ అవసరమని చెప్పుకొచ్చారు.

**పరిశోధన ఆధారిత చర్యలు**

వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సేకరించిన డేటా ఆధారంగా ప్రమాద ప్రాంతాలను గుర్తిస్తున్నామని కేంద్ర మంత్రి అన్నారు. రాష్ట్రాల మధ్య అనుభవాలను పంచుకోవడం ద్వారా మరింత సమర్థ వంతమైన పరిష్కారాలు సాధ్యమవుతాయన్నారు. ఏనుగుల సంర క్షణ, ఘర్షణల నివారణ కోసం రూ.500 కోట్ల నిధులు మంజూ రయ్యాయని తెలిపారు. ఈ నిధుల ద్వారా శాస్త్రీయ చర్యలను విస్తృత స్థాయిలో అమలు చేయవచ్చన్నారు. ఏనుగులు, ప్రజల ప్రాణాలు, జీవనోపాధి రక్షణ ప్రభుత్వాల బాధ్యత అని, కేంద్ర-రాష్ట్ర సమన్వయంతోనే దీర్ఘకాలిక పరిష్కారాలు సాధ్యమవుతాయని కేంద్ర పర్యావరణ సహాయక శాఖ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ పేర్కొన్నారు.

# ఎన్టీఆర్ కాలం నాటి రాజకీయాలు మళ్లీ రావాలి : అయ్యన్నపాత్రుడు

**గుంటూరు జిల్లా, (రాజధాని వార్తలు):** దివంగత మాజీ సీఎం ఎన్టీఆర్ కాలం నాటి రాజకీయాలు మళ్లీ రావాలని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆకాంక్షించారు. రాజకీయాల్లోకి రావాలనుకునే వారు కన్నా లక్ష్మీనారాయణను చూసి చాలా నేర్చుకోవాలని సూచించారు. గురువారం గుంటూరు జిల్లా వేదికగా మీడియాతో అయ్యన్నపాత్రుడు మాట్లాడారు. ఇప్పుడు జనం ఓసారి ఓటేస్తే.. రెండోసారి ఓటేయటం లేదని అన్నారు. అలాంటిది ఆరుసార్లు ప్రజల మనసు దోచుకుని కన్నా లక్ష్మీనారాయణ గెలిచారని ప్రస్తావించారు. అప్పటిలా జనం లేరని.. పూర్వం నాయకులు ఇప్పుడు లేరని అన్నారు. కన్నా క్రమశిక్షణ, వచ్చిన వారిని పలకరించటం, పని అవుతుందంటే చేసి పెట్టడం ఆయన ప్రత్యేకత అని కొనియాడారు. ప్రజలకు ఏం కావాలో వారి అవసరాలు తీర్చేలా పని చేశారని ప్రశంసించారు. కన్నా మాదిరిగా మిగతా వారు పని చేస్తే ఏపీ బాగుపడుతుందని తెలిపారు. రాజకీయాలు ఇప్పుడు వ్యాపారం అయ్యాయని అన్నారు. కన్నా మరింత ఆరోగ్యంగా ఉండి ప్రజలకు మరింత సేవ చేయాలని అయ్యన్నపాత్రుడు ఆకాంక్షించారు.



Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan